


'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575



www.rajamudranews.com

# అక్షర రాజముద్ర

ప్రతి అక్షరం - ప్రజల కోసం | తెలుగు దిన పత్రిక

AKSHARA RAJAMUDHRA | RNI No: TELTEL/2024/86684

| మేడ్చల్-మల్కాజ్‌గిరి | సోమవారం | 13.07.2026 | సంపుటి: 3 | సంచిక: 161 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | MONDAY | 13.07.2026 | V0LUME : 3 | ISSUE : 161 | PAGES: 8 | COST: 2/- |



## విలేకరులు కావలెను

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575


## రష్యా ఇంధన కేంద్రాలపై ఉక్రెయిన్ దాడులు



- ఆయిల్ రిఫైనరీ, ట్యాంకర్ లక్ష్యంగా డ్రోన్ దాడులు
- ఒడెస్సా, చోర్నోమోర్స్క్ పోర్టులపై రష్యా ప్రతిదాడి

4

## ప్రైవేటు సంస్థలకు మిసైల్ తయారీ బాధ్యతలు


- రక్షణ రంగంలో భారీ సంస్కరణ
- 'అస్త్ర మార్క్-2' క్షిపణి ప్రాజెక్టుపై కేంద్రం కసరత్తు
- ఎగుమతులు పెంచడమే లక్ష్యం..
- టాటా, అదానీ, మహీంద్రా రేసులో ఉండే అవకాశం
- కేంద్రం కీలక నిర్ణయం!




4

## ఉపా కేసులో ముగ్గురు పబ్లిషర్ల అరెస్ట్

- తీవ్రవాదులను కీర్తిస్తూ పుస్తక ప్రచురణ!
- 'పర్సనాలిటీస్ అండ్ లెజెండ్స్ ఆఫ్ జెఅండ్‌కే' పేరిట వేర్పాటువాద భావజాల ప్రచారం
- సాక్ష్యాలు నైశం చేసేందుకు ఢిల్లీ నిందితుడి యత్నం
- విద్యాశాఖలో 8 మంది సస్పెన్షన్




4

జమ్మూకాశ్మీర్‌లో ఉగ్రవాదులను, వేర్పాటువాదులను కీర్తిస్తూ పుస్తకం ప్రచురించిన వ్యవహారంలో జమ్మూ కౌంటర్ ఇంటెలిజెన్స్ వింగ్ అధికారులు ముగ్గురు నిందితులను ఉపా చట్టం కింద అరెస్టు చేశారు.



# కాంగ్రెస్‌లో వర్గ పోరు!

## ముదురుతున్న ఆధిపత్య పోరు

- తుంగతుర్తి ఘటనతో బహిర్గతమైన విభేదాలు
- పాలకుర్తి కామారెడ్డిలో కొత్త వివాదాలు
- వరంగల్ జిల్లాలో నేతల కుమ్ములాట
- వర్గ రాజకీయాలపై కార్యకర్తల ఆందోళన
- క్రమశిక్షణ కమిటీ హెచ్చరికలు బేఖాతరు
- పార్టీ ప్రతిష్ఠ దెబ్బతింటోందని ఆందోళన
- చర్యలు తీసుకోవాలని సీఎంకు విజ్ఞప్తి

2

సరిగ్గా 10 ఏళ్ల తర్వాత రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు రోజురోజుకూ తీవ్రంగా బహిర్గతమవుతున్నాయి. రాష్ట్రంలోని పలు నియోజకవర్గాల్లో నేతల మధ్య ఆధిపత్య పోరు తీవ్ర రూపం దాల్చుతుండటంతో పార్టీ శ్రేణుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. ఇటీవల సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గంలో చోటుచేసుకున్న తాజా పరిణామాలు కాంగ్రెస్‌లోని వర్గ రాజకీయాలను మరోసారి బట్టబయలు చేశాయి. పార్టీ పరువు బజారున పడుతున్నా నాయకులు ఏమాత్రం వెనక్కి తగ్గకపోవడం రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. జాజిరెడ్డిగూడెం మండలం అర్వపల్లిలో కాంగ్రెస్ పార్టీకి చెందిన 2 వర్గాలు పరస్పరం ఎదురుపడి ఘర్షణకు దిగాయి. రాళ్లు రువ్వుకోవడం, వాహనాలు ధ్వంసం లాంటి ఘటనలు చోటుచేసుకున్నాయి.



## సాగునీటిపై రాజకీయ రగడ!

- ప్రాజెక్టులపై తీవ్ర వివాదం
- ప్రతిపక్షాల ప్రశ్నలకు సమాధానాలు లేవు
- కేవలం విమర్శలకే సీఎం పరిమితం
- రైతుల ప్రయోజనాలపై స్పష్టత కరవు
- వేడెక్కుతున్న రాష్ట్ర నీటిపారుదల రాజకీయం

...వివరాలు 2లో

# నీళ్లు ఇవ్వకుంటే ప్రాణత్యాగానికి సిద్ధం

- మా నెత్తురు ధారపోస్తాం తీసుకోండి
- రక్తం రుచిమరిగిన తోడేలు కాంగ్రెస్
- సీఎం హోదాకు తగని వ్యాఖ్యలు
- ఎండుతున్న పొలాలకు నీళ్లు ఇవ్వాలి
- రాష్ట్ర ప్రభుత్వంపై కేటీఆర్ ఫైర్




సాగునీటి కోసం ఆందోళన చేస్తున్న రైతులపై 'నీళ్లు అడిగితే నెత్తురు చల్లుతా' అని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించడం ఆయన హోదాకు ఏమాత్రం తగదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా మండిపడ్డారు. తెలంగాణ రక్తాన్ని తాగడమే పనిగా పెట్టుకున్న కాంగ్రెస్ పార్టీకి ఇంకెంత రక్తం కావాలో చెప్పాలని ఆయన ప్రశ్నించారు. రైతుల పొలాలకు నీళ్లు ఇచ్చే వరకు తమ పోరాటం ఆగదని, రైతుల కోసం ఎంత రక్తమైనా ధారపోయడానికి సిద్ధంగా ఉన్నామని కేటీఆర్ సవాల్ చేశారు. తెలంగాణ రక్తం రుచిమరిగిన తోడేలు లాంటి కాంగ్రెస్ పార్టీ రక్తదాహం ఇంకా తీరలేదా అని నిలదీశారు.

*- హైదరాబాద్, జూలై 12*

2

# కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణలో నిర్లక్ష్యం

- జాప్యంతో రైతులకు తీవ్ర నష్టం
- విజిలెన్స్ నివేదికను బయట పెట్టాలి
- సీఎం రేవంత్‌కు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు లేఖ

3





## రాజ్‌కుమార్ కోసం వేట!

- 12 ప్రత్యేక బృందాలతో గాలింపు
- చేగూరు వద్ద కారు గుర్తింపు
- ట్రాక్ కిందకు దూకిన నిందితుడు
- సిమ్ కార్డుల ద్వారా నిఘా
- శ్రీశైలం మార్గంలో పోలీసుల నిఘా

3

## కాళేశ్వరంపై చర్యలేవి రేవంత్?

- చర్యలు తీసుకోని కాంగ్రెస్ సర్కార్
- కవిత ఆరోపణలపై విచారణ జరపాలి
- నిధులపై సమాధానం చెప్పాల్సిన బాధ్యత బీజేపీయే అసలైన ప్రత్యామ్నాయం!
- నిజామాబాద్ ఎంపీ అరవింద్

2





## చిన్నారితో కారు డ్రైవింగ్!

- మనవరాలితో కారు నడిపించిన ఎస్ఐ
- సామాజిక మాధ్యమాల్లో వీడియో వైరల్
- ప్రశ్నించిన స్థానికులపై తీవ్ర దురుసు
- రంగారెడ్డి జిల్లాలో ఘటన కలకలం
- దర్యాప్తు కోరుతున్న స్థానిక ప్రజలు

3

## భలే మాట!



గాన కోకిల చనిపోయినది అని కోకిలలు వచ్చి సానుభూతి చెబుతున్నాయి.

# కాళేశ్వరంపై చర్యలేవి రేవంత్?

**చర్యలు తీసుకోని కాంగ్రెస్ సర్కార్**

**కవిత ఆరోపణలపై విచారణ జరపాలి**

**నిధులపై సమాధానం చెప్పాల్సిన బాధ్యత**

**బీజేపీయే అసలైన ప్రత్యామ్నాయం!**

**నిజామాబాద్ బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్**



**హైదరాబాద్, జూలై 12:** రాష్ట్ర పరిపాలనను కాంగ్రెస్ ప్రభుత్వం అమ్ముకుంటోందని నిజామాబాద్ బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్ తీవ్రంగా ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతిపై నివేదికలు వచ్చినా సర్కార్ ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ఆయన ప్రశ్నించారు. బీఆర్ఎస్ పార్టీ నిధులపై కవిత చేసిన వ్యాఖ్యలపై సీబీఐ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రజల విశ్వాసాన్ని పూర్తిగా కోల్పోయిన కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు ప్రత్యామ్నాయం బీజేపీయే అని ఆయన స్పష్టం చేశారు. జగిత్యాల పర్యటనలో ఉన్న ఎంపీ అరవింద్ ఆదివారం మీడియాతో మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డిపై తీవ్ర విమర్శలు చేశారు. విద్యాశాఖ, రాష్ట్ర పరిపాలనపై ముఖ్యమంత్రికి కనీస అవగాహన లేదని ఆయన ఆరోపించారు. పరిపాలనలో సమర్థత చూపాల్సిన ప్రభుత్వం కేవలం కాలయాపన చేస్తోందని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతిపై కమిషన్ నివేదిక వచ్చినప్పటికీ బాధ్యులపై ఇప్పటివరకు చర్యలు తీసుకోకపోవడంపై మండిపడ్డారు.

### కవిత వ్యాఖ్యలపై విచారణ

బీఆర్ఎస్ పార్టీ నిధులపై కల్వకుంట్ల కవిత చేసిన వ్యాఖ్యలు తీవ్ర ఆరోపణలని అరవింద్ అన్నారు. ఈ వ్యవహారంపై సీబీఐతో సమగ్ర విచారణ జరిపించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దీనిపై కేటీఆర్, హరీశ్ రావు ప్రజలకు సమాధానం చెప్పాలని కోరారు. ప్రజల సొమ్ముతో రాజకీయాలు చేస్తున్నారనే ఆరోపణలపై పూర్తి స్థాయిలో విచారణ జరగాల్సిన అవసరం ఉందన్నారు.

### ఎమ్మెల్యే సంజయ్‌పై ఫైర్

జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌పై అరవింద్ విమర్శలు గుప్పించారు. కేంద్రీయ విద్యాలయానికి తగినంత భూమి కేటాయించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. కేంద్ర నిధుల విషయంలో ప్రజలను తప్పుదోవ పట్టించే వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు. బీజేపీ ప్రజాప్రతినిధులపై రాజకీయ ఒత్తిళ్లు తీసుకురావడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పాలనపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఉందని, రాబోయే రోజుల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని అరవింద్ ధీమా వ్యక్తం చేశారు.

# రేవంత్ వ్యాఖ్యలు బాధించాయి!

**సీఎం వ్యాఖ్యలతో మనస్తాపం చెందాం.. రేవంత్ విజ్ఞతకే వదిలేస్తున్నాం**

**ఉచితంగా సేవలందించేందుకు సిద్ధంగా ఉన్నాం**

**కరువు పరిస్థితుల్లో చర్యలు చేపట్టాలి: శ్యాంప్రసాద్**

**హైదరాబాద్ , జూలై 12:** కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో తమపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు తీవ్రంగా బాధించాయని రిటైర్డ్ ఇంజినీర్ శ్యాంప్రసాద్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాజెక్టుల విషయంలో తమకు ఎలాంటి రాజకీయ ఉద్దేశాలు లేవని, ప్రభుత్వం ఎప్పుడు పిలిచినా ఉచితంగా సహకరించేందుకు సిద్ధంగా ఉన్నామని ఆయన స్పష్టం చేశారు. జీవితాంతం నిష్ఠతో పనిచేసిన తమపై అపనిందలు వేయడాన్ని తట్టుకోలేక ఓ వార్తా ఛానల్ ఇంటర్వ్యూలో ఆయన తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. మేడిగడ్డ వద్ద బ్యారేజీ నిర్మాణాన్ని తాము అప్పట్లోనే తీవ్రంగా వ్యతిరేకించామని శ్యాంప్రసాద్ రెడ్డి తెలిపారు. ఆ సమయంలో పలుమార్లు బహిరంగంగా అభ్యంతరాలు వ్యక్తం చేసినప్పటికీ, అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ తమను పిలిపించి అభిప్రాయాలు తెలుసుకున్నారని, కానీ వ్యక్తిగత విమర్శలు చేయలేదని గుర్తు చేశారు. ప్రస్తుత ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలను ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నామని తీవ్ర ఆవేదనగా పేర్కొన్నారు.

### తాగునీటి కష్టాలు తప్పవు..

కన్నెపల్లి వద్ద నీటిని పంపింగ్ చేయడానికి అవసరమైన నీటి లభ్యత ఉందని సంబంధిత సంస్థ నివేదికలో పేర్కొన్నట్లుగా తక్షణ చర్యలు చేపట్టవచ్చని శ్యాంప్రసాద్ రెడ్డి అభిప్రాయపడ్డారు. కరువు పరిస్థితుల హెచ్చరికల నేపథ్యంలో నీటి పంపింగ్ ఆలస్యం చేస్తే తీవ్ర తాగునీటి సమస్యలు తలెత్తే అవకాశం ఉందని ఆయన హెచ్చరించారు. ప్రాజెక్టును నిరంతరం పర్యవేక్షిస్తూ నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు.

### ఉచితంగా సేవలు అందిస్తాం..

తమకు ఏ రాజకీయ పార్టీతో సంబంధం లేదని ఆయన స్పష్టం చేశారు. ఇటీవల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో ఫోన్‌లో మాట్లాడినట్లు వెల్లడించారు. ప్రభుత్వం కోరితే ప్రాజెక్టు వద్దే ఉండి ఉచితంగా సాంకేతిక సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నామని ఆయనకు చెప్పినట్లు తెలిపారు. ప్రభుత్వ సేవలో నిష్ఠతో పనిచేసిన తమపై ఇలాంటి ఆరోపణలు రావడం తీవ్ర బాధ కలిగించిందని చెబుతూ శ్యాంప్రసాద్ రెడ్డి కన్నీటిపర్యంతమయ్యారు.

# కాంగ్రెస్‌లో వర్గ పోరు!

- నియోజకవర్గాల్లో ముదురుతున్న ఆధిపత్య పోరు
- తుంగతుర్తి ఘటనతో బహిర్గతమైన విభేదాలు
- పాలకుర్తి కామారెడ్డిలో కొత్త వివాదాలు
- వరంగల్ జిల్లాలో నేతల కుమ్ములాట
- వర్గ రాజకీయాలపై కార్యకర్తల ఆందోళన
- క్రమశిక్షణ కమిటీ హెచ్చరికలు బేఖాతరు
- పార్టీ ప్రతిష్ఠ దెబ్బతింటోందని ఆందోళన
- జోక్యం చేసుకోవాలంటున్న పార్టీ శ్రేణులు
- చర్యలు తీసుకోవాలని సీఎంకు విజ్ఞప్తి



**తెలంగాణ బ్యూరో, జూలై 12:**

సరిగ్గా 10 ఏళ్ల తర్వాత రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు రోజురోజుకూ తీవ్రంగా బహిర్గతమవుతున్నాయి. రాష్ట్రంలోని పలు నియోజకవర్గాల్లో నేతల మధ్య ఆధిపత్య పోరు తీవ్ర రూపం దాల్చుతుండటంతో పార్టీ శ్రేణుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. ఇటీవల సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గంలో చోటుచేసుకున్న తాజా పరిణామాలు కాంగ్రెస్‌లోని వర్గ రాజకీయాలను మరోసారి బట్టబయలు చేశాయి. పార్టీ పరువు బజారున పడుతున్నా నాయకులు ఏమాత్రం వెనక్కి తగ్గకపోవడం రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. జాజిరెడ్డిగూడెం మండలం అర్వపల్లిలో కాంగ్రెస్ పార్టీకి చెందిన 2 వర్గాలు పరస్పరం ఎదురుపడి ఘర్షణకు దిగాయి. ఒకరిపై ఒకరు రాళ్లు రువ్వుకోవడం, వాహనాలు ధ్వంసం చేసుకోవడం లాంటి దారుణ ఘటనలు చోటుచేసుకున్నాయి. ఇటీవల మండల కాంగ్రెస్ అధ్యక్షుల నియామకాలను తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఒక వర్గం గాంధీభవన్‌కు వెళ్లేందుకు సిద్ధమైంది. సరిగ్గా అదే సమయంలో మరోవైపు ఎమ్మెల్యే మందుల శామ్యూల్‌ను కలిసేందుకు వెళ్తున్న వర్గం అదే మార్గంలో ఎదురుకావడంతో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో అర్వపల్లి ప్రాంతంలో భారీ ఉద్రిక్తత నెలకొంది.

### పలు జిల్లాల్లో ముదురుతున్న పోరు..

తుంగతుర్తి నియోజకవర్గంలోనే కాకుండా రాష్ట్రంలోని అనేక నియోజకవర్గాల్లో సరిగ్గా ఇదే తరహా పరిస్థితులు కొనసాగుతున్నాయని పార్టీ వర్గాల్లో పెద్ద ఎత్తున చర్చ సాగుతోంది. పాలకుర్తిలో ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, స్థానిక నేతల మధ్య ఉన్న విభేదాలు ఇప్పటికే క్రమశిక్షణా కమిటీ దృష్టికి వెళ్లాయి. అటు కామారెడ్డిలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, పీసీసీ ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్ రెడ్డి మధ్య సాగుతున్న ఆధిపత్య పోరు కూడా పార్టీకి పెద్ద తలనొప్పిగా మారింది. అటు ఉమ్మడి వరంగల్ జిల్లాలో మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే కడియం శ్రీహరి మధ్య నెలకొన్న విభేదాలు కూడా నేరుగా అధిష్ఠానం దృష్టికి వెళ్లినట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది.

### క్రమశిక్షణా కమిటీ నోటీసులు ఇచ్చినా..

పార్టీ క్రమశిక్షణా కమిటీ పలువురు నేతలకు ఇప్పటికే షోకాజ్ నోటీసులు జారీ చేసి వారి నుంచి వివరణలు కోరుతోంది. అయినా క్షేత్రస్థాయిలో పరిస్థితుల్లో ఏమాత్రం మార్పు కనిపించడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. నేతల మధ్య వర్గ విభేదాలు ఇలాగే కొనసాగుతుండటంతో కాంగ్రెస్ పార్టీ ప్రతిష్ఠ దారుణంగా దెబ్బతింటోందని క్షేత్ర స్థాయి కార్యకర్తలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### అధిష్ఠానం జోక్యం చేసుకోవాల్సిందే..

పార్టీలో నెలకున్న గ్రూపు రాజకీయాలకు తక్షణమే ముగింపు పలకాలని, నేతల మధ్య సమన్వయం పెంచాలని కాంగ్రెస్ శ్రేణులు ముక్తకంఠంతో కోరుతున్నాయి. పార్టీ క్రమశిక్షణకు విరుద్ధంగా వ్యవహరించే ఎంతటి పెద్ద నాయకులపైనైనా కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని వారు స్పష్టం చేస్తున్నారు. అంతర్గత విభేదాలను వెంటనే పరిష్కరించేందుకు అధిష్ఠానం పెద్దలు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ప్రత్యక్షంగా జోక్యం చేసుకోవాలని కార్యకర్తలు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు.

# సాగునీటిపై రాజకీయ రగడ!

- ప్రాజెక్టులపై తీవ్ర వివాదం
- ప్రతిపక్షాల ప్రశ్నలకు సమాధానాలు లేవు
- కేవలం విమర్శలకే సీఎం పరిమితం
- రైతుల ప్రయోజనాలపై స్పష్టత కరవు
- వేడెక్కుతున్న రాష్ట్ర నీటిపారుదల రాజకీయం



**హైదరాబాద్ , జూలై 12:** రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణ, నీటి పంపిణీపై ప్రభుత్వ వైఖరి రాజకీయ వర్గాల్లో తీవ్ర దుమారం రేపుతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయాలపై ప్రతిపక్షాలు వరుసగా సంధిస్తున్న ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు ఇవ్వకుండా ప్రభుత్వం కేవలం రాజకీయ విమర్శలకే పరిమితమవుతోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వాస్తవాలతో సమాధానాలు చెప్పకుండా వ్యక్తిగత దూషణలకు దిగడంపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. సాగునీటి అంశాన్ని రాజకీయ కోణంలో కాకుండా రైతుల ప్రయోజనాల దృష్ట్యా చూడాలని నిపుణులు సూచిస్తున్నారు. రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణ, కొత్త ప్రాజెక్టుల అమలు విధానం తీవ్ర చర్చకు దారితీసింది. ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలపై ప్రతిపక్ష పార్టీలు వరుసగా అభ్యంతరాలు వ్యక్తపరుస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన ప్రాజెక్టుల ప్రస్తుత పరిస్థితి, భవిష్యత్ కార్యాచరణపై పూర్తి వివరాలు వెల్లడించాలని డిమాండ్ చేస్తున్నాయి. రైతులకు సాగునీరు సకాలంలో అందేలా చూడాల్సిన బాధ్యతను గుర్తు చేస్తున్నాయి.

### ప్రశ్నలకు సమాధానాలు కరవు

ప్రతిపక్షాలు లేవనెత్తుతున్న ప్రశ్నలకు వాస్తవ ఆధారాలతో సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అయితే ప్రభుత్వం మాత్రం ఈ విమర్శలను కేవలం రాజకీయ కోణంలోనే చూస్తోందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. అసలు సమస్యలపై చర్చకు పెద్దపీట వేయకుండా వ్యక్తిగత ఆరోపణలతో కాలయాపన చేస్తున్నారని దుయ్యబడుతున్నాయి. ప్రజలకు అవసరమైన ప్రాజెక్టుల పురోగతిపై స్పష్టత ఇవ్వడం ప్రభుత్వ ప్రాథమిక విధి అని పేర్కొంటున్నాయి.

### రైతుల ప్రయోజనాలే ముఖ్యం


సాగునీటి అంశం కేవలం రాజకీయ ఆరోపణలు, ప్రత్యారోపణలకే పరిమితం కాకుండా రైతుల సుదీర్ఘ భవిష్యత్తుతో ముడిపడి ఉందని సాగునీటి నిపుణులు గట్టిగా సూచిస్తున్నారు. ప్రాజెక్టుల పురోగతి, నీటి లభ్యత, సాగు విస్తీర్ణం పెంపు లాంటి కీలక అంశాలపై ప్రభుత్వం ఒక సమగ్రమైన కార్యాచరణను ప్రజల ముందు ఉంచాలని డిమాండ్ చేస్తున్నారు. రాజకీయాలకు అతీతంగా అన్నదాతల ప్రయోజనాలను పరమావధిగా తీసుకుని తగిన నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్పష్టం చేస్తున్నారు.

# ఎంతైనా దిగజారండి చూస్తా!

**విమర్శకులకు ప్రకాశ్ రాజ్ కౌంటర్.. యూట్యూబ్ ఛానళ్లపై తీవ్ర ఆరోపణలు**

**కట్టుకథలతో నిజాన్ని మార్చలేరని వెల్లడి.. ప్రశ్నించే స్వరాలను అణచివేయడం అసాధ్యం**

**హైదరాబాద్, జూలై 12:** "నేను మౌనంగా లేను... అన్నీ గమనిస్తున్నా. అబద్ధాలు, కట్టుకథలు, వ్యక్తిగత దూషణలతో ప్రశ్నించే గొంతుకలను ఎవరూ ఆపలేరు" అంటూ ప్రముఖ నటుడు ప్రకాశ్ రాజ్ తనపై వస్తున్న విమర్శలకు ఘాటుగా స్పందించారు. సోషల్ మీడియాలో తనపై జరుగుతున్న ప్రచారాన్ని ఉద్దేశిస్తూ ఆయన ఒక వీడియోను విడుదల చేశారు. తనను విమర్శించే వారిపై వ్యంగ్యంగా ఆయన బదులిచ్చిన తీరు ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. తనపై జరుగుతున్న ప్రతి చిన్న విషయాన్ని తాను నిశితంగా గమనిస్తున్నానని ప్రకాశ్ రాజ్ పేర్కొన్నారు. అబద్ధాలు, కట్టుకథలు, వ్యక్తిగత దూషణలతో నిజాన్ని ఎప్పటికీ మార్చలేరని ఆయన స్పష్టం చేశారు. ఎంతటి ప్రచారం చేసినా ప్రశ్నించే స్వరాలను అణచివేయడం సాధ్యం కాదని ఆయన తేల్చి చెప్పారు.



### వ్యంగ్యంగా స్పందించిన నటుడు

తన విమర్శకులను ఉద్దేశించి 'దిగజారండి' అనే పదాన్ని పదేపదే ఉపయోగిస్తూ ప్రకాశ్ రాజ్ వ్యంగ్యంగా విరుచుకుపడ్డారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు, కొందరు సామాజిక మాధ్యమ కార్యకర్తలు, యూట్యూబ్ ఛానళ్లు పనిగట్టుకుని తనపై అసత్య ప్రచారం చేస్తున్నాయని ఆయన తీవ్రంగా ఆరోపించారు. విమర్శకులను ఉద్దేశించి వ్యంగ్య ధోరణిలో ప్రకాశ్ రాజ్ చేసిన ఈ ఘాటు వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో విస్తృతంగా చర్చనీయాంశమయ్యాయి. తనను టార్గెట్ చేసిన వారిపై ధీటుగా స్పందిస్తూ ఆయన విడుదల చేసిన వీడియో ప్రస్తుతం వివిధ సామాజిక మాధ్యమ వేదికల్లో విపరీతంగా వైరల్‌గా మారింది.

# నిజాయతీ ఉంటేనే నమ్ముతారు!

**ప్రకాశ్ రాజ్‌పై బండ్ల సెటైర్లు.. సినిమా డైలాగులు కాదంటూ చురకలు**

**పైసా కొట్టు డైలాగ్ పట్టు.. ఎక్స్ వేదికగా ఘాటు స్పందన..**

**హైదరాబాద్ , జూలై 12):** "ప్రజల మనసు గెలవాలంటే స్క్రిప్ట్ కాదు... నిజాయతీ కావాలి. సినిమాల్లో డైలాగులు చెప్పినట్లు కాకుండా హృదయం నుంచి మాట్లాడితేనే ప్రజలు నమ్ముతారు" అంటూ నటుడు ప్రకాశ్ రాజ్‌కు సినీ నిర్మాత బండ్ల గణేశ్ సోషల్ మీడియా వేదికగా ఘాటు కౌంటర్ ఇచ్చారు. ప్రకాశ్ రాజ్ విడుదల చేసిన వీడియోకు వ్యంగ్యంగా ఆయన బదులిచ్చిన తీరు ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. తనపై జరుగుతున్న విమర్శలు, తప్పుడు ప్రచారాలపై స్పందిస్తూ ప్రకాశ్ రాజ్ ఎక్స్ వేదికగా వీడియోను విడుదల చేశారు. "ప్రశ్నించే గొంతుల మీద తప్పుడు ప్రచారం చేస్తున్న వారికి నా సమాధానం" అంటూ చేసిన ఆ వీడియో సోషల్ మీడియాలో విస్తృతంగా చర్చకు దారితీసింది. దీనిపై బండ్ల గణేశ్ ఎక్స్ వేదికగా దీటుగా స్పందించారు. ఎవరితోనో రాయించి తెచ్చిన ట్వీట్‌ను పోస్ట్ చేయడం కాదని, ప్రజలతో మాట్లాడే మాట హృదయం నుంచి రావాలని ఆయన వ్యాఖ్యానించారు.



### నటన కాదు నిజాయతీ..

ప్రజల విశ్వాసాన్ని పొందాలంటే నటన కాదు, నిజాయతీ అవసరమని బండ్ల గణేశ్ తన పోస్టులో స్పష్టం చేశారు. అంతటితో ఆగని ఆయన మరో పోస్టులో "పైసా కొట్టు... డైలాగ్ పట్టు!" అంటూ ప్రకాశ్ రాజ్‌పై వ్యంగ్య వ్యాఖ్యలు చేశారు. ఈ పోస్టులు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారగా, 2 గురి మధ్య మొదలైన మాటల యుద్ధం నెట్టింట తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

# నీళ్లు ఇవ్వకుంటే ప్రాణత్యాగానికి సిద్ధం

- మా నెత్తురు ధారపోస్తాం తీసుకోండి
- రక్తం రుచిమరిగిన తోడేలు కాంగ్రెస్
- సీఎం హోదాకు తగని వ్యాఖ్యలు
- ఎండుతున్న పొలాలకు నీళ్లు ఇవ్వాలి
- లేదంటే రైతుల పక్షాన ఉద్యమం
- రాష్ట్ర ప్రభుత్వంపై కేటీఆర్ ఫైర్




**హైదరాబాద్ జూలై 12:** సాగునీటి కోసం ఆందోళన చేస్తున్న రైతులపై 'నీళ్లు అడిగితే నెత్తురు చల్లుతా' అని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించడం ఆయన హోదాకు ఏమాత్రం తగదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా మండిపడ్డారు. తెలంగాణ రక్తాన్ని తాగడమే పనిగా పెట్టుకున్న కాంగ్రెస్ పార్టీకి ఇంకెంత రక్తం కావాలో చెప్పాలని ఆయన ప్రశ్నించారు. రైతుల పొలాలకు నీళ్లు ఇచ్చే వరకు తమ పోరాటం ఆగదని, రైతుల కోసం ఎంత రక్తమైనా ధారపోయడానికి సిద్ధంగా ఉన్నామని కేటీఆర్ సవాల్ చేశారు. తెలంగాణ రక్తం రుచిమరిగిన తోడేలు లాంటి కాంగ్రెస్ పార్టీ రక్తదాహం ఇంకా తీరలేదా అని నిలదీశారు. సాగునీటి విడుదల విషయంలో సీఎం వ్యాఖ్యలపై కేటీఆర్ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రైతులు నీటి కోసం రోడ్డెక్కాల్సిన పరిస్థితి ఏర్పడడం ముమ్మాటికీ ప్రభుత్వ వైఫల్యమే అని ఆయన విమర్శించారు. రైతుల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం వారిని అవమానించేలా మాట్లాడటం సరికాదన్నారు. ఎండుతున్న పంటలను కాపాడేందుకు వెంటనే సాగునీరు అందించే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమస్యను పరిష్కరించకుండా రాజకీయ వ్యాఖ్యలతో కాలక్షేపం చేయడం ప్రభుత్వ బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని కేటీఆర్ దుయ్యబట్టారు.

## రక్తదాహం ఇంకా తీరలేదా..

తెలంగాణ పిల్లల్ని పిట్టల్ని కాల్చినట్టు కాల్చిపారేసి ఎన్ కౌంటర్ల పేరుతో నెత్తుటేళ్లు పారించిన నరహంతకులు కాంగ్రెస్ నాయకులే అని కేటీఆర్ మండిపడ్డారు. 1952 లో 7 గురు యువకులను కాల్చిచంపి రక్తం కళ్లజూసిన రాక్షసులు కాంగ్రెస్ వాళ్లే అని ఆయన విమర్శించారు. 1969 లో 369 మంది ముద్దుబిడ్డలపై తూటాలు కురిపించి రక్తం పారించిన ఖూనీకోర్లు అని ధ్వజమెత్తారు. మలిదశ పోరాటంలో 1000 మందిని బలితీసుకున్న మృగాలు కూడా వారేనని తీవ్రంగా ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ చేతులు తెలంగాణ బిడ్డల రక్తంతో తడిచి ఉన్నాయని, వారి రక్కసి కోరలకు తెలంగాణ నెత్తుటి మరకలు అంటి ఉన్నాయని దుయ్యబట్టారు.

## ఉద్యమానికి మేం సిద్ధం..

కాంగ్రెస్ ప్రభుత్వానికి తమ రక్తం ఎంత కావాలంటే అంత పంపిస్తామని, కానీ రైతులకు మాత్రం వెంటనే సాగునీళ్లు ఇవ్వాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. పేగులు తెగేదాకా రాష్ట్రం కోసం కొట్లాడిన వాళ్లమని, రైతుల కోసం ఎంత రక్తమైనా ధారపోయడానికి సిద్ధంగా ఉన్నామని ఆయన స్పష్టం చేశారు. నీళ్లలో నిప్పులు పుట్టించి జలసాధన పోరాటాలు చేసిన చరిత్ర తమకు ఉందని గుర్తుచేశారు. నెత్తురు ఇస్తేనే నీళ్లు ఇస్తామని కర్కశ కాంగ్రెస్ ప్రభుత్వం కోరుతుంటే తమ నెత్తురు ధారపోస్తామని సవాల్ చేశారు. ముందుగా ప్రభుత్వ పెద్దలు వాళ్ల రక్తదాహం తీర్చుకుని, ఎండుతున్న పొలాల జలదాహం తీర్చాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతుల తరఫున మరోసారి ఉద్యమానికి సిద్ధంగా ఉంటామని కేటీఆర్ గట్టిగా హెచ్చరించారు.

# బ్యారేజీల పునరుద్ధరణలో నిర్లక్ష్యం

- జాప్యంతో రైతులకు తీవ్ర నష్టం
- ఎన్డీఎస్ఏ సిఫారసుల అమలులో విఫలం
- విజిలెన్స్ నివేదికను బయట పెట్టాలి
- సీఎం రేవంత్‌కు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు లేఖ



**హైదరాబాద్ జూలై 12:** కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు ఆరోపించారు. ఎన్డీఎస్ఏ సిఫారసులను అమలు చేయడంలో సర్కార్ నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో రైతులు, ప్రజలు తీవ్రంగా నష్టపోయారని మండిపడ్డారు. ఈ అంశంపై ఆదివారం సీఎం రేవంత్ రెడ్డికి రాంచందర్ రావు బహిరంగ లేఖ రాశారు. మొత్తం ప్రాజెక్టుపై సీబీఐ విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. ఆ 3 బ్యారేజీల పునరుద్ధరణలో ప్రభుత్వం తీవ్ర జాప్యం చేసిందని రాంచందర్ రావు తన లేఖలో విమర్శించారు. 2024, 2025, 2026 సంవత్సరాల్లో పనులు పూర్తి చేసేందుకు తగిన సమయం ఉన్నప్పటికీ ప్రభుత్వం ఆ అవకాశాన్ని వినియోగించుకోలేదన్నారు. జాతీయ ఆనకట్టల భద్రతా సంస్థ (ఎన్డీఎస్ఏ) సూచించిన సాంకేతిక పరీక్షలు, పునరుద్ధరణ చర్యలను సకాలంలో అమలు చేయకపోవడం ముమ్మాటికీ ప్రభుత్వ వైఫల్యమే అని ఆయన పేర్కొన్నారు.

## జాప్యంతో భారీ నష్టం..

3 బ్యారేజీల పునరుద్ధరణ ఆలస్యం కావడంతో గోదావరి జలాలను వినియోగించుకునే అవకాశం కోల్పోయామని రాంచందర్ రావు ఆరోపించారు. అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు తక్కువ నష్టం జరిగినప్పటికీ వాటిని ముందుగా పునరుద్ధరించి ఉంటే ఉత్తర తెలంగాణలో 20 నుంచి 25 లక్షల ఎకరాలకు సాగునీరు, పలు జిల్లాలకు తాగునీరు అందించే అవకాశం ఉండేదన్నారు. జల్ శక్తి మంత్రిత్వ శాఖ కమిటీ కేవలం సాంకేతిక మార్గదర్శకత్వం మాత్రమే ఇస్తుందని, దాన్ని అమలు చేసే బాధ్యత పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు.

## నివేదికలు బహిర్గతం చేయాలి..

విజిలెన్స్ కమిటీ నివేదికను వెంటనే బహిర్గతం చేయాలని రాంచందర్ రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆ నివేదికలో పేర్కొన్న వారిపై పూర్తి స్థాయిలో చర్యలు తీసుకోలేదని విమర్శించారు. జస్టిస్ పి.సి ఘోష్ కమిషన్ నివేదిక విషయంలో కూడా ప్రభుత్వం హైకోర్టులో సమర్థంగా వాదించలేదని ఆరోపించారు. 3 బ్యారేజీల అంశానికే సీబీఐ విచారణను పరిమితం చేయడం వెనుక ఉద్దేశం ఏమిటని ఆయన ప్రశ్నించారు. 1.30 లక్షల కోట్ల వ్యయంతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు మొత్తంపై, పంప్ హౌస్‌లు, కాల్వలు, టన్నెల్లు, రిజర్వాయర్లు సహా అన్ని నిర్మాణాలపై సమగ్ర సీబీఐ విచారణ జరిపించాలని ఆయన తన లేఖలో డిమాండ్ చేశారు.

# శేఖర్, జానీ ఫైట్!

## డ్యాన్సర్స్ అసోసియేషన్‌లో రగడ!

**శేఖర్, జానీ వర్గాల రగడ.. అధ్యక్షురాలు సుమలతపై తీవ్ర ఆరోపణలు**

**రాజీనామా చేసిన 10 మంది.. రంగంలోకి దిగిన యూనియన్ పెద్దలు**

**హైదరాబాద్ జూలై 12:** టాలీవుడ్ డ్యాన్సర్స్ అసోసియేషన్ ఎన్నికల నేపథ్యంలో ప్రముఖ కొరియోగ్రాఫర్లు శేఖర్ మాస్టర్, జానీ మాస్టర్ వర్గాల మధ్య విభేదాలు తీవ్రరూపం దాల్చాయి. సభ్యత్వాల అంశంతో పాటు ఎన్నికల నిర్వహణపై ఇరు వర్గాల మధ్య తీవ్ర భిన్నాభిప్రాయాలు వ్యక్తమవడంతో అసోసియేషన్ కార్యాలయం వద్ద భారీ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అసోసియేషన్ ఎన్నికల ప్రక్రియ, సభ్యత్వాల నిర్వహణపై ఇరు వర్గాలు పరస్పరం ఆరోపణలు చేసుకోవడంతో ఈ వివాదం మరింత ముదిరింది. ఒకరిపై ఒకరు విమర్శలు గుప్పించుకోవడంతో సభ్యుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఫెడరేషన్ అనుమతి లేకుండానే ఉప ఎన్నిక నిర్వహించే ప్రయత్నం జరిగిందనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఈ అంశమే ప్రస్తుత వివాదానికి ప్రధాన కారణంగా మారిందని తెలుస్తోంది. పరిస్థితిని చక్కదిద్దేందుకు యూనియన్ పెద్దలు రంగంలోకి దిగినట్లు సమాచారం.

## సుమలతపై తీవ్ర ఆరోపణలు

ఈ వ్యవహారంలో జానీ మాస్టర్ భార్య, అసోసియేషన్ అధ్యక్షురాలు సుమలత పేరును కూడా కొందరు సభ్యులు ప్రధానంగా ప్రస్తావించారు. అసోసియేషన్ వ్యవహారాల్లో ఆమె పూర్తిగా ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని కొందరు డ్యాన్సర్లు ఆరోపిస్తున్నారు. ఈ విమర్శల కారణంగానే అసోసియేషన్‌కు చెందిన 10 మంది సభ్యులు మూకుమ్మడిగా రాజీనామా చేసినట్లు సమాచారం. వివాదం మరింత ముదరకుండా యూనియన్ పెద్దలు వెంటనే జోక్యం చేసుకోవాలని అసోసియేషన్ సభ్యులు కోరుతున్నారు. ఇరు వర్గాలతో మాట్లాడి ఈ సమస్యను సామరస్యంగా పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ వ్యవహారంపై సంబంధిత వర్గాల నుంచి అధికారిక స్పందన రావాల్సి ఉంది.



# ఫిలింనగర్‌లో ఫెరారీ బీభత్సం!

**అదుపుతప్పిన స్పోర్ట్స్ కారు.. ఇంటి గేటుకు తీవ్ర నష్టం**

**కారు వదిలి యువకుల పరారీ.. మద్యం మత్తులో ఉన్నారనే అనుమానం**



**హైదరాబాద్ జూలై 12:** హైదరాబాద్‌లోని ఫిలింనగర్‌లో ఆదివారం తెల్లవారుజామున ఓ ఫెరారీ స్పోర్ట్స్ కారు తీవ్ర బీభత్సం సృష్టించింది. అతివేగంగా అదుపుతప్పి రోడ్డుపక్కన ఉన్న ఓ నివాస గృహం ప్రధాన గేటును బలంగా ఢీకొట్టింది. ప్రమాదం జరిగిన వెంటనే కారులో ఉన్న యువకులు వాహనాన్ని అక్కడే వదిలేసి పరారయ్యారు. డ్రైవర్ మద్యం మత్తులో ఉన్నాడా లేక అతివేగం, నిర్లక్ష్యంగా వాహనం నడపడం వల్లే ఈ ప్రమాదం జరిగిందా అనే కోణంలో పోలీసులు ముమ్మర దర్యాప్తు చేపట్టారు. ప్రమాదం ధాటికి ఆ ఇంటి గేటు పూర్తిగా ధ్వంసం కాగా, కారు ముందు భాగం తీవ్రంగా దెబ్బతింది. అదృష్టవశాత్తూ ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. తెల్లవారుజామున పెద్ద శబ్దంతో ప్రమాదం జరగడంతో స్థానికులు ఒక్కసారిగా భయాందోళనతో బయటకు వచ్చి చూడగా కారు గేటును ఢీకొట్టినట్లు గుర్తించారు. సమాచారం అందుకున్న ఫిలింనగర్ పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

## అన్ని కోణాల్లో దర్యాప్తు..

ప్రమాదానికి గురైన ఫెరారీ కారును క్రేన్ సహాయంతో పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఫెరారీ కారు ప్రమాదంపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టామని పోలీసులు వెల్లడించారు. వాహనం రిజిస్ట్రేషన్ నంబర్, సీసీటీవీ ఫుటేజీల ఆధారంగా కారు యజమానితో పాటు ప్రమాద సమయంలో వాహనం నడిపిన వ్యక్తిని గుర్తించే చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయని వారు స్పష్టం చేశారు.

# రాజ్‌కుమార్ కోసం వేట!

**12 ప్రత్యేక బృందాలతో గాలింపు.. చేగూరు వద్ద కారు గుర్తింపు**

**ట్రాక్ కిందకు దూకిన నిందితుడు.. సిమ్ కార్డుల ద్వారా నిఘా**

**శ్రీశైలం మార్గంలో పోలీసుల నిఘా**

**హైదరాబాద్, జూలై 12:** రంగారెడ్డి జిల్లా షాబాద్‌లో ఒకే కుటుంబానికి చెందిన 6 గురిని దారుణంగా హత్య చేసిన ప్రధాన నిందితుడు రాజ్‌కుమార్ కోసం పోలీసులు విస్తృత స్థాయిలో గాలింపు కొనసాగిస్తున్నారు. నిందితుడిని పట్టుకునేందుకు 12 ప్రత్యేక బృందాలు రాత్రింబగళ్లు శ్రమిస్తున్నాయి. అతడు పోలీసులకు చిక్కకుండా తప్పించుకుంటూ ఉండటంతో ఈ దర్యాప్తు మరింత ఉత్కంఠభరితంగా మారింది. సాంకేతిక ఆధారాలతో పోలీసులు నిందితుడి ప్రతి కదలికపై డేగకన్ను వేశారు. హత్యల అనంతరం కారులో పరారైన రాజ్‌కుమార్ చేగూరు ప్రాంతానికి చేరుకునే సరికి వాహనంలో పెట్రోల్ పూర్తిగా అయిపోయింది. దీంతో కారును అక్కడే వదిలేసి కాలినడకన తిమ్మాపూర్ రైల్వే ట్రాక్ వైపు వెళ్లినట్లు దర్యాప్తులో తేలింది. అక్కడ ప్రయాణిస్తున్న రైలుకు ఎదురుగా వెళ్లిన అతడు చివరి క్షణంలో వెనక్కి తగ్గి ట్రాక్ కిందకు దూకినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. అనంతరం అతడు ఏ దిశగా వెళ్లాడనే విషయంపై ఆధారాల కోసం గాలింపు కొనసాగుతోంది.

## కాల్ డేటాపై నిఘా..

నిందితుడు ముందస్తు ప్రణాళికతోనే వ్యవహరించినట్లు పోలీసులు భావిస్తున్నారు. అతడి వద్ద 3 మొబైల్ ఫోన్లు, 12 కు పైగా సిమ్ కార్డులు ఉన్నట్లు గుర్తించారు. సాంకేతిక పరిజ్ఞానం ద్వారా తన ఆచూకీ బయటపడకుండా ఉండేందుకు ప్రస్తుతం వాటిని ఉపయోగించడం లేదని అధికారులు అనుమానిస్తున్నారు. అయినప్పటికీ అతడికి సంబంధించిన అన్ని మొబైల్ నంబర్లను సైబర్ విభాగం నిరంతరం పర్యవేక్షిస్తోంది. ఏ సిమ్ కార్డు యాక్టివ్ అయినా వెంటనే గుర్తించేలా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు.

## శ్రీశైలం మార్గంలో జల్లెడ..

రాజ్‌కుమార్ కోసం 12 ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. తిమ్మాపూర్ రైల్వే స్టేషన్‌తో పాటు పరిసర ప్రాంతాల సీసీటీవీ దృశ్యాలను పోలీసులు పరిశీలిస్తున్నారు. నిందితుడికి తరచూ శ్రీశైలం వెళ్లే అలవాటు ఉన్నట్లు సమాచారం రావడంతో అక్కడ కూడా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. సాధువుల మధ్య లేదా భక్తుల వేషంలో తలదాచుకునే అవకాశం ఉందని భావించి ఆలయ పరిసర ప్రాంతాల్లో తనిఖీలు ముమ్మరం చేశారు. బెంగళూరు జాతీయ రహదారి, పొరుగు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల్లో కూడా గాలింపును వేగవంతం చేశారు. పోలీసులు అందుబాటులో ఉన్న ప్రతి సాంకేతిక, భౌతిక ఆధారాన్ని వినియోగిస్తూ నిందితుడి కోసం వేట కొనసాగిస్తున్నారు.

# చిన్నారితో కారు డ్రైవింగ్!

**మనవరాలితో కారు నడిపించిన ఎస్ఐ**

**సామాజిక మాధ్యమాల్లో వీడియో వైరల్**

**ప్రశ్నించిన స్థానికులపై తీవ్ర దురుసు**

**రంగారెడ్డి జిల్లాలో ఘటన కలకలం**



**హైదరాబాద్ జూలై 12:** రంగారెడ్డి జిల్లాకు చెందిన ఓ పోలీసు అధికారి తన 6 ఏళ్ల మనవరాలికి ప్రధాన రహదారిపై కారు డ్రైవింగ్ నేర్పించిన ఘటన తీవ్ర కలకలం రేపుతోంది. దీనిని ప్రశ్నించిన స్థానికులపై సదరు ఎస్ఐ దురుసుగా ప్రవర్తించడంతో అక్కడున్న వారు తీసిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. చట్టాలు అమలు చేయాల్సిన అధికారే ఇలా నిబంధనలు ఉల్లంఘించడంపై నెటిజన్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై తక్షణమే విచారణ జరపాలని డిమాండ్ చేస్తున్నారు. మెయిన్ రోడ్డుపై ఓ ఎస్ఐ తన 6 ఏళ్ల మనవరాలిని డ్రైవింగ్ సీటులో కూర్చోబెట్టి కారు నడిపించినట్లు స్థానికులు చెబుతున్నారు. చిన్నారితో రోడ్డుపై వాహనం నడపించడం ప్రమాదకరమని వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో సదరు ఎస్ఐ వారిపై దురుసుగా వ్యవహరించారు. "నా ఇష్టం... నన్ను అడగడానికి మీరెవరు?" అని ఎదురుదాడికి దిగినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పలువురు ఆ అధికారి తీరుపై తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు.


## చర్యలు తీసుకోవాలని డిమాండ్..

చిన్నారులకు వాహనాలు నడిపేందుకు అనుమతించడం మోటారు వాహనాల చట్టానికి పూర్తిగా విరుద్ధమని నెటిజన్లు పేర్కొంటున్నారు. ప్రజలకు చట్టాలను అమలు చేయాల్సిన బాధ్యత ఉన్న అధికారులే నిబంధనలు ఉల్లంఘిస్తే సమాజంలోకి తప్పుడు సంకేతాలు వెళ్తాయని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలు వెలుగులోకి తీసుకురావాలని డిమాండ్ చేస్తున్నారు. అయితే ఈ ఘటనపై పోలీసు శాఖ నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. వీడియోలో కనిపిస్తున్న వ్యక్తి, ఘటన జరిగిన పరిస్థితులు, ఆరోపణల వాస్తవాలపై అధికారిక నిర్ధారణ రావాల్సి ఉంది. దర్యాప్తు అనంతరం మాత్రమే పూర్తి వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

# మానవ కళ్యాణమే లక్ష్యం!

**ఎంపీ ఈటెల రాజేందర్**

**హైదరాబాద్ జూలై 12:** లక్షలాది మంది సాధు సంతులు ఈ దేశమే తమ కుటుంబంగా భావించి సేవలు చేస్తున్నందువల్లే నేటికీ సమాజంలో ప్రశాంతత నెలకొందని మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్ అన్నారు. మానవ కళ్యాణమే భారతీయ సంస్కృతి మూల సూత్రమని, ప్రపంచానికి సనాతన ధర్మాన్ని అందించిన ఘనత భారతదేశానిదేనని ఆయన స్పష్టం చేశారు. ఎల్బీనగర్‌లోని సువర్ణ భారతి గోశాలలో నిర్వహించిన భారత్ నేషనలిస్ట్ ఫోరం 3 వ వార్షికోత్సవ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా నిలిచిన భారత్ అన్ని వర్గాల ప్రజలు కలిసిమెలిసి జీవించే అవకాశాన్ని కల్పించిందని ఈటెల రాజేందర్ పేర్కొన్నారు. సర్వేజన సుఖినోభవంతు అనే భావన మన భారతీయ సంస్కృతికి అసలైన ప్రతీక అని ఆయన స్పష్టం చేశారు. పాశ్చాత్య ప్రభావంతో నేటి యువత భారతీయ విలువలకు దూరం కాకుండా కుటుంబ వ్యవస్థ, మన సంస్కృతి సంప్రదాయాల పట్ల వారికి పూర్తి అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.




# బాధితుల భద్రతకు భరోసా ఎక్కడ?

**రంగారెడ్డి జిల్లా షాబాద్‌లో జరిగిన ఘటన చర్చనీయాంశంగా మారింది. పోక్సో కేసులో అరెస్టయి బెయిల్‌పై బయటకు వచ్చిన వ్యక్తి... కేసు నమోదు చేసిన బాలిక కుటుంబ సభ్యులతో పాటు తన భార్య, పిల్లలను కూడా హత్య చేయడం కలకలం రేపింది. భారతదేశంలో లైంగిక నేరాలపై కఠిన చట్టాలు ఉన్నాయి. నిర్భయ ఘటన తర్వాత శిక్షలను మరింత కఠినతరం చేశారు. పోక్సో చట్టాన్ని బలోపేతం చేశారు. ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేశారు. అయినప్పటికీ లైంగిక నేరాలు తగ్గకపోవడం, బాధితులపై ఒత్తిళ్లు కొనసాగడం, ఫిర్యాదు చేసిన వారిపై ప్రతీకార చర్యలు చోటుచేసుకోవడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది.**

ప్రతి బెయిల్ పొందిన నిందితుడు మళ్లీ నేరానికి పాల్పడడు. అలాగే ప్రతి నిందితుడిని విచారణ పూర్తయ్యే వరకు జైలులోనే ఉంచడం కూడా రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం. కానీ లైంగిక నేరాల్లో మరో అంశాన్ని కూడా సమానంగా పరిగణించాల్సిన అవసరం ఉందని న్యాయ నిపుణులు చాలాకాలంగా చెబుతున్నారు. ఫిర్యాదు చేసిన తర్వాత నిందితుడు ఆమెను బెదిరిస్తున్నాడా? సాక్షులను ప్రభావితం చేసే ప్రయత్నం చేస్తున్నాడా? కుటుంబ సభ్యులపై ఒత్తిడి తెస్తున్నాడా? ప్రతీకారం తీర్చుకుంటానని హెచ్చరిస్తున్నాడా? ఇలాంటి అంశాలను మరింత లోతుగా పరిశీలించే వ్యవస్థ అవసరమని అనేక న్యాయవేత్తలు సూచిస్తున్నారు. లైంగిక నేరాల్లో నిందితుడి ప్రమాద స్థాయిని అంచనా వేసే శాస్త్రీయ వ్యవస్థ మన దేశంలో ఇంకా పరిమితంగానే ఉంది. ప్రతి కేసులో ఒకే విధానం ఉండదు. పోలీసుల నివేదికలు, ప్రాసిక్యూషన్ వాదనలు, అందుబాటులో ఉన్న సాక్ష్యాలు, కేసు పరిస్థితుల ఆధారంగానే నిర్ణయాలు జరుగుతాయి. కానీ ఒక వ్యక్తి గతంలో బెదిరింపులు చేశాడా? బాధితురాలిపై అసాధారణ మోజు లేదా ద్వేషం ఉందా? మళ్లీ హింసకు పాల్పడే అవకాశముందా? వంటి అంశాలపై మరింత సమగ్ర అంచనా అవసరమని నేరశాస్త్ర నిపుణులు చాలాకాలంగా చెబుతున్నారు.

ప్రపంచంలోని కొన్ని దేశాలు ఈ దిశగా ముందుకు వెళ్లాయి. గృహహింస, లైంగిక నేరాలు, స్టాకింగ్ కేసుల్లో "హై రిస్క్ అఫెండర్" వ్యవస్థను అమలు చేస్తున్నాయి. కోర్టు బెయిల్ ఇచ్చినా, బాధితురాలికి చేరువ కాకూడదనే కఠిన షరతులు, ఎలక్ట్రానిక్ పర్యవేక్షణ, నిర్దిష్ట వ్యవధిలో పోలీస్ స్టేషన్‌లో హాజరు, షరతులు ఉల్లంఘిస్తే వెంటనే బెయిల్ రద్దు వంటి చర్యలు తీసుకుంటున్నారు. ప్రతి దేశానికి తనదైన చట్టవ్యవస్థ ఉన్నప్పటికీ, బాధితుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలనే ఆలోచన మాత్రం ఒకేలా ఉంది. భారతదేశంలో కూడా ఇలాంటి అంశాలపై చర్చ మొదలైంది. అయితే అమలు స్థాయిలో ఇంకా చాలా దూరం వెళ్లాల్సి ఉంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో బాధిత కుటుంబాలకు రక్షణ కల్పించడం, సాక్షులపై ఒత్తిడి లేకుండా చూడటం, బెయిల్ షరతులను కచ్చితంగా అమలు చేయించడం వంటి అంశాల్లో మరింత బలోపేతం అవసరం. భారతదేశంలో ఇప్పటికే లైంగిక నేరాలకు సంబంధించి కఠిన చట్టాలు ఉన్నాయి. అసలు అవసరం చట్టాలను మరింత పెంచడం కాదు. ఉన్న చట్టాలను సమర్థంగా అమలు చేయడం, ప్రమాదాన్ని ముందే గుర్తించడం, బాధితులకు నిరంతర రక్షణ కల్పించడం, బెయిల్ షరతుల పర్యవేక్షణను కట్టుదిట్టం చేయడం.

షాబాద్ ఘటన ఒక కుటుంబానికి జరిగిన విషాదం మాత్రమే కాదు. అది మొత్తం వ్యవస్థకు ఒక హెచ్చరిక. లైంగిక నేరాల్లో న్యాయం అంటే కేవలం నిందితుడికి శిక్ష పడటం మాత్రమే కాదు. బాధితుడు భయపడకుండా జీవించగలిగే వాతావరణాన్ని కల్పించడం కూడా. ప్రతి నిందితుడికి చట్టం హక్కులు ఇస్తుంది. అదే చట్టం ప్రతి బాధితుడికి భద్రతను కూడా హామీ ఇవ్వాలి. ఈ రెండింటి మధ్య సమతుల్యత సాధించినప్పుడే న్యాయం సంపూర్ణమవుతుంది. లైంగిక నేరాల్లో విచారణ పూర్తయ్యే వరకు బాధితులు ప్రాణభయంతో జీవించాల్సి వస్తే, మనం నిందితుడిని మాత్రమే విచారిస్తున్నామేమో గానీ, బాధితుడిని రక్షిస్తున్నామని చెప్పుకోలేం. ప్రజాస్వామ్య సమాజంలో చట్టం యొక్క అంతిమ లక్ష్యం నేరం జరిగిన తర్వాత తీర్పు ఇవ్వడం మాత్రమే కాదు... నేరం మళ్లీ జరగకుండా నిరోధించడం, బాధితుడి ప్రాణాన్ని కాపాడటం కూడా. అదే దిశగా మన వ్యవస్థ అడుగులు వేయాల్సిన సమయం ఆసన్నమైంది

# రష్యా ఇంధన కేంద్రాలపై ఉక్రెయిన్ దాడులు

- ఆయిల్ రిఫైనరీ, ట్యాంకర్ లక్ష్యంగా డ్రోన్ దాడులు
- ఒడెస్సా, చోర్నోమోర్స్క పోర్టులపై రష్యా ప్రతిదాడి



**మాస్కో, జూలై 12:** రష్యా–ఉక్రెయిన్ సరిహద్దుల్లో యుద్ధ జ్వాలలు మరింత తీవ్రరూపం దాల్చాయి. రష్యా ఇంధన రంగాన్ని టార్గెట్ చేస్తూ ఉక్రెయిన్ సైన్యం ఆదివారం తెల్లవారుజామున సమారా ప్రాంతంతో పాటు వ్యూహాత్మక అజోవ్–బ్లాక్ సీ కెనాల్‌పై డ్రోన్లతో భారీ దాడులకు తెగబడింది. రష్యా ఇంధన రంగ దిగ్గజం 'రాస్‌నెఫ్ట్'కు చెందిన ప్రసిద్ధ 'సిజ్రాన్ ఆయిల్ రిఫైనరీ'పై ఉక్రెయిన్ డ్రోన్లు విరుచుకుపడ్డాయి. ఈ దాడిలో రిఫైనరీలోని ఒక పారిశ్రామిక వాడతో పాటు సమీప నివాస సముదాయాలు దెబ్బతిన్నట్లు స్థానిక గవర్నర్ ధృవీకరించారు. రష్యాను ఆర్థికంగా బలహీనపరచడమే లక్ష్యంగా ఈ దాడులు చేసినట్లు ఉక్రెయిన్ మిలిటరీ స్పష్టం చేసింది. రిఫైనరీతో పాటు అజోవ్–బ్లాక్ సీ కెనాల్ గుండా వెళ్తున్న రష్యాకు చెందిన ఒక భారీ ఆయిల్ ట్యాంకర్‌ను కూడా ఉక్రెయిన్ డ్రోన్లు లక్ష్యంగా చేసుకున్నాయి. అయితే, దాడి జరిగిన సమయంలో ఆ ట్యాంకర్ ఖాళీగా తిరిగొస్తోందని, అందులో ఎలాంటి ఇంధనం లేకపోవడం వల్ల పెద్ద ప్రమాదం తప్పిందని రష్యా అధికారులు వెల్లడించారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని పేర్కొన్నారు. కాగా, రష్యా ఆధీనంలోని క్రిమియా ద్వీపకల్పానికి ఇంధన సరఫరాను పూర్తిగా నిలిపివేయడమే ధ్యేయంగా ఉక్రెయిన్ ఇప్పటివరకు ఈ ప్రాంతంలో సుమారు 40కి పైగా రష్యా చమురు ట్యాంకర్లపై దాడులు చేయడం గమనార్హం. ఈ దాడుల ప్రభావంతో క్రిమియాలో తీవ్ర ఇంధన కొరత ఏర్పడటంతో అక్కడ అధికారులు ఇప్పటికే అత్యవసర పరిస్థితిని (ఎమర్జెన్సీ) ప్రకటించారు. మరోవైపు, ఉక్రెయిన్ దాడులకు ప్రతిచర్యగా రష్యా సైన్యం కూడా తన క్షిపణి దాడులను ముమ్మరం చేసింది. ఉక్రెయిన్ వైమానిక రక్షణ వ్యవస్థల బలహీనతను ఆసరా చేసుకుని వ్యూహాత్మక నగరాలపై రష్యా విరుచుకుపడుతోంది. తాజాగా ఉక్రెయిన్‌కు చెందిన అంతర్జాతీయ వాణిజ్య కేంద్రాలైన ఒడెస్సా, చోర్నోమోర్స్క నౌకాశ్రయాలపై (పోర్టులపై) తాము భారీ మిసైల్ దాడులు నిర్వహించి శత్రువుల మౌలిక వసతులను ధ్వంసం చేసినట్లు రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ అధికారికంగా ప్రకటించింది. ఇరు దేశాల పరస్పర దాడులతో కృష్ణసముద్ర (బ్లాక్ సీ) ప్రాంతంలో ఉద్రిక్తతలు పతాక స్థాయికి చేరాయి.

# ప్రైవేటు సంస్థలకు మిసైల్ తయారీ బాధ్యతలు

- రక్షణ రంగంలో భారీ సంస్కరణ
- 'అస్త్ర మార్క్-2' క్షిపణి ప్రాజెక్టుపై కేంద్రం కసరత్తు
- ఎగుమతులు పెంచడమే లక్ష్యం..
- టాటా, అదానీ, మహీంద్రా రేసులో ఉండే అవకాశం
- కేంద్రం కీలక నిర్ణయం!




**న్యూఢిల్లీ, జూలై 12:** భారత రక్షణ రంగంలో మరో భారీ సంస్కరణకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమైనట్లు తెలుస్తోంది. దేశీయంగా రక్షణ ఉత్పత్తులను భారీగా పెంచడంతో పాటు అంతర్జాతీయంగా డిమాండ్‌కు తగ్గట్టు ఎగుమతులు చేసేందుకు వీలుగా, క్షిపణుల (మిసైల్స్) తయారీ బాధ్యతలను ప్రైవేటు రంగానికి అప్పగించాలని కేంద్రం నిర్ణయించినట్లు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఇటీవల రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ అభివృద్ధి చేసిన 'అస్త్ర' మిసైల్ కొనుగోలుకు ఇండోనేషియా సహా పలు దేశాలు ఆసక్తి వ్యక్తం చేయడంతో, డిమాండ్‌కు అనుగుణంగా సరఫరాను పెంచేందుకు కేంద్రం ఈ కీలక నిర్ణయం తీసుకుంది.

## త్వరలోనే ప్రతిపాదనల ఆహ్వానం..

భారత రక్షణ శాఖ అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న 'అస్త్ర మార్క్–2' క్షిపణుల తయారీపై ఆసక్తి ఉన్న దేశీయ ప్రైవేటు సంస్థల నుంచి త్వరలోనే ప్రతిపాదనలు ఆహ్వానించే అవకాశం ఉందని సమాచారం. ఈ మెగా ప్రాజెక్టును దక్కించుకునేందుకు ఐసీఓఎమ్ఎమ్, అదానీ డిఫెన్స్, భారత్ ఫోర్జ్, టాటా గ్రూప్, మహీంద్రా గ్రూప్ తదితర దిగ్గజ సంస్థలు తమ ప్రతిపాదనలను సమర్పించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం భారత ప్రైవేటు రంగం యుద్ధ విమానాలు, డ్రోన్లు, ఆర్టిలరీ గన్లు, యుద్ధ నౌకల తయారీకే పరిమితం కాగా.. ఈ నిర్ణయంతో తొలిసారిగా క్షిపణుల తయారీ రంగంలోకి అడుగుపెట్టనుంది. దీనితో పాటు స్వల్ప శ్రేణి బాలిస్టిక్ క్షిపణి అయిన 'ప్రళయ్' తయారీ బాధ్యతలను కూడా ప్రైవేటు రంగానికి అప్పగించడంపై కేంద్రం యోచిస్తున్నట్లు రక్షణ రంగ వర్గాలు వెల్లడించాయి.

## చైనా పీఎల్-15ఈ క్షిపణికి దీటుగా 'అస్త్ర మార్క్-2'

గగనతలంలోని శత్రు లక్ష్యాలను కచ్చితత్వంతో ధ్వంసం చేసేందుకు భారత్ ఈ అత్యాధునిక క్షిపణిని సిద్ధం చేసింది. ఇది గరిష్ఠంగా 200 కిలోమీటర్ల దూరంలోని శత్రు విమానాలను, డ్రోన్లను ఛేదించగలదు. చైనాకు చెందిన దీర్ఘ శ్రేణి ఎయిర్–టు–ఎయిర్ మిసైల్ 'పీఎల్–15ఈ'కి పోటీగా ఈ క్షిపణిని రూపుదిద్దింది. ఈ అస్త్ర మార్క్–2 మిసైల్‌ను మన వాయుసేనకు చెందిన తేజస్ మార్క్ 1ఏ, మిగ్–29, సుఖోయ్–30 ఎమ్‌కేఐతో పాటు నౌకాదళానికి చెందిన రఫేల్ మెరైన్ ఫైటర్ జెట్ల నుంచి సులువుగా ప్రయోగించవచ్చు. మేక్ ఇన్ ఇండియాలో భాగంగా ప్రైవేటు రంగానికి ఈ బాధ్యతలు అప్పగిస్తే, భారత సైన్యానికి క్షిపణుల కొరత తీరడమే కాకుండా గ్లోబల్ డిఫెన్స్ మార్కెట్లో భారత్ అగ్రగామిగా ఎదిగేందుకు మార్గం సుగమం కానుంది.

# ఉపా కేసులో ముగ్గురు పబ్లిషర్ల అరెస్ట్

- తీవ్రవాదులను కీర్తిస్తూ పుస్తక ప్రచురణ!
- 'పర్సనాలిటీస్ అండ్ లెజెండ్స్ ఆఫ్ జెఅండ్‌కే' పేరిట వేర్పాటువాద భావజాల ప్రచారం
- సాక్ష్యాలు నైశం చేసేందుకు ఢిల్లీ నిందితుడి యత్నం
- విద్యాశాఖలో 8 మంది సస్పెన్షన్

**జమ్మూ, జూలై 12 :** జమ్మూకాశ్మీర్‌లో ఉగ్రవాదులను, వేర్పాటువాదులను కీర్తిస్తూ పుస్తకం ప్రచురించిన వ్యవహారంలో జమ్మూ కౌంటర్ ఇంటెలిజెన్స్ వింగ్ అధికారులు ముగ్గురు నిందితులను ఉపా చట్టం కింద అరెస్టు చేశారు. 'పర్సనాలిటీస్ అండ్ లెజెండ్స్ ఆఫ్ జమ్మూ అండ్ కాశ్మీర్' అనే వివాదాస్పద పుస్తకం ప్రచురణ, పంపిణీకి బాధ్యులైన ముగ్గురు పబ్లిషర్లను సీఐజే అధికారులు అదుపులోకి తీసుకున్నారు. అరెస్టయిన నిందితుల్లో ఇద్దరు దేశ రాజధాని ఢిల్లీకి చెందినవారు కాగా, మరొకరు జమ్మూ నివాసిగా దర్యాప్తు అధికారులు వెల్లడించారు.

## డేటా డిలీట్ చేసినా రికవరీ..

ఢిల్లీకి చెందిన నిందితుల్లో ఒకరు ఈ పుస్తకం ప్రచురణకు సంబంధించిన డిజిటల్ రికార్డులను పూర్తిగా తొలగించి, సాక్ష్యాలను నాశనం చేసేందుకు ప్రయత్నించారని అధికారులు ఆరోపిస్తున్నారు. అయితే దర్యాప్తు బృందాలు అత్యాధునిక సాంకేతికతతో ఆ కీలకమైన డేటాను తిరిగి భద్రపరిచాయి. కొన్ని రోజుల కిందట ఢిల్లీ, జమ్మూలలోని సదరు ప్రచురణ సంస్థలపై సీఐజే బృందాలు ఏకకాలంలో దాడులు నిర్వహించి పుస్తకం ముద్రణ, సరఫరా, పంపిణీకి సంబంధించిన కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నాయి. ఆ ఆధారాల ప్రకారమే తాజాగా ఈ ముగ్గురి అరెస్టులు నమోదయ్యాయి.

## రచయితల కోసం గాలింపు.. అధికారులపై వేటు

ఈ వివాదాస్పద పుస్తక రచయితల కోసం కౌంటర్ ఇంటెలిజెన్స్ వింగ్ గాలింపు చర్యలను ముమ్మరం చేసింది. రచయితల్లో ఒకరైన సంతోశ్ మీనాను ప్రశ్నించేందుకు సీఐజే బృందం ఇప్పటికే రాజస్థాన్‌కు చేరుకోగా, రెండో రచయిత హిలాల్ అహ్మద్ ఇంకా పరారీలోనే ఉన్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. కాగా, ఈ పుస్తకానికి విద్యాశాఖ పరిధిలో అనుమతులు లభించడంపై ప్రభుత్వం సీరియస్‌గా ఉంది. పుస్తక ప్రచురణకు ఆమోదం తెలిపిన 'సమగ్ర శిక్షా డైరెక్టరేట్'పై దాడులు జరిపిన అధికారులు, ఈ వ్యవహారంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన విద్యాశాఖకు చెందిన ఎనిమిది మంది అధికారులను ఇప్పటికే సస్పెండ్ చేశారు.

## పుస్తకంలో మక్బూల్ భట్, గీలనీల గ్లోరిఫికేషన్!

సదరు పుస్తకంలో జమ్మూకాశ్మీర్‌కు చెందిన పలువురు మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాదులు, వేర్పాటువాదులను గొప్ప వ్యక్తులుగా చిత్రీకరించే ప్రత్యేక అధ్యాయాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ముఖ్యంగా 1984లో బ్రిటన్‌లోని బర్మింగ్‌హామ్‌లో భారత దౌత్యవేత్త రవీంద్ర మహాత్రేను అత్యంత దారుణంగా హత్య చేసిన ఉగ్రవాది మక్బూల్ భట్‌ను హీరోలా కీర్తించినట్లు తేలింది. దీనితో పాటు లోయలో విద్వేషాలు రగిల్చిన సయ్యద్ అలీ షా గిలనీ, మస్రత్ ఆలం, మీర్వైజ్ ఉమర్ ఫరూఖ్ వంటి వేర్పాటువాదులను జమ్మూకాశ్మీర్ ఆదర్శ పురుషులుగా అభివర్ణిస్తూ అతివాద భావజాలాన్ని నూరిపోసేందుకు ప్రయత్నించినట్లు అధికారులు స్పష్టం చేశారు.


# మేఘాలయ, అసోం సరిహద్దుల్లో భూప్రకంపనలు

## ఈస్ట్ గారో హిల్స్ కేంద్రంగా 4.5 తీవ్రతతో భూకంపం

**న్యూఢిల్లీ, జూలై 12:** మేఘాలయ కేంద్రంగా ఆదివారం మధ్యస్థాయి భూకంపం సంభవించింది. దీని ప్రభావంతో పొరుగు రాష్ట్రమైన అసోంలోని గౌహతి, దాని పరిసర ప్రాంతాలతో పాటు షిల్లాంగ్‌లోనూ భారీగా భూప్రకంపనలు చోటుచేసుకున్నాయి. ఈ రోజు మధ్యాహ్నం సరిగ్గా 12:00 గంటలకు మేఘాలయలోని ఈస్ట్ గారో హిల్స్ జిల్లా కేంద్రంగా రిక్టర్ స్కేలుపై 4.5 తీవ్రతతో ఈ భూకంపం వచ్చినట్లు అధికారులు ధ్రువీకరించారు. నేషనల్ సెంటర్ ఫర్ సీస్మాలజీ (చీజా) సామాజిక మాధ్యమం 'ఎక్స్' లో వెల్లడించిన వివరాల ప్రకారం.. మేఘాలయలోని ఈస్ట్ గారో హిల్స్ పరిధిలో భూమికి కేవలం 5 కిలోమీటర్ల లోతులోనే ఈ భూకంప కేంద్రం నమోదైంది. భూమి లోతు తక్కువగా ఉండటం వల్లే ప్రకంపనల తీవ్రత పొరుగు జిల్లాలకు, రాష్ట్రాలకు పాకింది. ఈ ఘటనపై అసోంలోని కహిలిపారాకు చెందిన స్థానికురాలు తనూజ న్యూస్ లైవ్‌తో మాట్లాడుతూ.. తాను వంటగదిలో పని చేసుకుంటున్న సమయంలో ఒక్కసారిగా ఒకటి రెండు సెకన్ల పాటు ఇల్లంతా గట్టిగా కంపించిందని, భయాందోళనకు గురైనట్లు పేర్కొన్నారు. భూకంప కేంద్రానికి సమీపంలో ఉన్న సరిహద్దు ప్రాంతాలతో పాటు అటు మేఘాలయ రాజధాని షిల్లాంగ్‌లోనూ ప్రజలు ఈ ప్రకంపనలను స్పష్టంగా గుర్తించారు. ఒక్కసారిగా భూమి కంపించడంతో ఇళ్లలో ఉన్న జనం భయంతో వీధుల్లోకి పరుగులు తీశారు. అయితే మధ్యస్థాయిలో వచ్చిన ఈ భూకంపం కారణంగా ఎటువంటి ప్రాణనష్టం కానీ, మౌలిక వసతులకు ఆస్తి నష్టం కానీ జరిగినట్లు ఇప్పటివరకు ఎలాంటి అధికారిక నివేదికలు అందలేదని విపత్తు నిర్వహణ బృందాలు వెల్లడించాయి.

# ఓటరు నమోదు ప్రక్రియ పారదర్శకంగా జరగాలి





- క్షేత్రస్థాయిలో 'సర్' కార్యక్రమాన్ని పరిశీలించిన మాజీ మేయర్ జక్కా వెంకట్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి

**మేడిపల్లి, జూలై 12, రాజముద్ర న్యూస్:**

ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ఓటరు జాబితా సవరణ ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా నిర్వహించాలని మాజీ మేయర్ జక్కా వెంకట్ రెడ్డి, మేడిపల్లి మాజీ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి అధికారులకు సూచించారు. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మేడిపల్లి డివిజన్ సాయి హిల్స్ కాలనీలో కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ ఐ ఆర్) కార్యక్రమాన్ని ఆదివారం వారు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీలో ఏర్పాటు చేసిన కేంద్రాలను సందర్శించి, అక్కడ విధులు నిర్వహిస్తున్న బీఎల్వోలు (బి ఎల్ వో లు), బీఆర్ఎస్ పార్టీ బూత్ లెవెల్ ఏజెంట్లు (బి ఎల్ ఏ లు)తో కలిసి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను వారు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా పేరు నమోదు చేసుకునేలా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలు సైతం ఈ ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఓటరు జాబితాలో తమ పేర్లు, వివరాలను పరిశీలించుకుని అవసరమైన సవరణలు చేయించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ పార్టీ నాయకులు శ్యామల శ్రీనివాస్, పైళ్ల ప్రభాకర్ రెడ్డి, కాలనీ అధ్యక్ష కార్యదర్శులు, కాలనీ వాసులు, బూత్ లెవెల్ ఏజెంట్లు, బీఎల్వోలు తదితరులు పాల్గొన్నారు.



# బల్కంపేటలో ఏడంతస్తుల బోనం

## అద్భుత విన్యాసాలతో ఆకట్టుకున్న రామచంద్రయ్య

**శేరిలింగంపల్లి, రాజముద్ర న్యూస్ :**

నగరంలో ఆషాఢ బోనాల సందడి ఘనంగా ప్రారంభమైంది. ఈ ఉత్సవాల్లో భాగంగా బల్కంపేట ఎల్లమ్మ పోచమ్మ దేవాలయంలో భక్తుడు రామచంద్రయ్య ఏడంతస్తుల భారీ బోనాన్ని ఎత్తి అపారమైన భక్తిని చాటుకున్నాడు.

కేవలం తలపై బోనం ఎత్తడమే కాకుండా, తన అద్భుతమైన శారీరక శక్తితో కఠినమైన విన్యాసాలు చేసి అక్కడి భక్తులను ఆకట్టుకున్నాడు. అమ్మవారికి బోనం సమర్పించే క్రమంలో ఆయన ప్రదర్శించిన సాహసకృత్యాలు భక్తులను విశేషంగా అబ్బురపరిచాయి. ఏడంతస్తుల బోనాన్ని అవలీలగా మోస్తూ ఆయన ప్రదర్శించిన ప్రతిభ ఉత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రామచంద్రయ్య చూపిన ఈ అద్భుత భక్తికి, సాహసాలకు ముగ్ధులైన తోటి భక్తులు ఆయనను మనస్ఫూర్తిగా అభినందించారు.



# కార్యకర్తల వెంటే నేను ఉంటా

## కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

**శేరిలింగంపల్లి, రాజముద్ర న్యూస్ :**

కార్యకర్తలను కాపాడుకునే వాళ్లే నాయకులవుతారని, కులం, మతం చూసి కాదని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ఆదివారం శేరిలింగంపల్లి నియోజకవర్గం ఉమ్మడి మియాపూర్ డివిజన్ న్యూ కాలనీలో బీఎస్ఎన్ కిరణ్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన బూత్ లెవెల్ మీటింగ్‌కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మియాపూర్ డివిజన్‌లో 57 బూత్‌లున్నాయని, ఆశావహులకు ఇది మంచి అవకాశమన్నారు. బస్తీలు, అపార్ట్‌మెంట్లలో ఇంటింటికి తిరిగి ఓటు నమోదు చేయించాలని పిలుపునిచ్చారు. సర్వేలో బీఆర్ఎస్ మొదటి స్థానంలో, కాంగ్రెస్ మూడో స్థానంలో ఉందన్నారు. క్షేత్రస్థాయిలో తిరిగి అన్ని డివిజన్లలో గెలిపించాలని, కార్యకర్తలను ఇబ్బంది పెట్టే వారికి అదే రీతిలో సమాధానం చెప్తామని హెచ్చరించారు. తాను ఎప్పుడూ కార్యకర్తల వెంట ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పురుషోత్తం యాదవ్, రంగారావు, రోజా కలిదిండి, బీఎస్ఎన్ కిరణ్ యాదవ్, గోపరాజు శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

# చెన్నారం గ్రామంలో దొంగల హల్చల్

- ఇంట్లో చోరీ, వెండి నగలు-డబ్బు అపహరణ
- పోలీసుల విచారణ

**ఖమ్మం రాజముద్ర న్యూస్**



నేలకొండపల్లి మండలం చెన్నారం గ్రామంలో చోరీ ఘటన కలకలం రేపింది. పట్టా పగులు దొంగలు ఒక ఇంట్లో పడి వెండి నగలు, నగదును ఎత్తుకెళ్లారు. చెన్నారం గ్రామంలోని పాండవచెలక రోడ్డు ప్రక్కననివాసం ఉంటున్న షేక్ నసర్ బీ ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి ఇంట్లోకి చొరబడిన దొంగలు అల్మారాలను పగలగొట్టి వెండి నగలు, నగదును దోచుకెళ్లినారు. సమాచారం అందుకున్న వెంటనే నేలకొండపల్లి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. వేలిముద్రల నిపుణులు ఆధారాలు సేకరించారు. ఈ ఘటనపై బాధితులు నేలకొండపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. చుట్టుపక్కల సీసీ కెమెరాల ఫుటేజ్‌ను పరిశీలిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.ఈ చోరీతో గ్రామంలో భయాందోళన నెలకొంది. పోలీసులు రాత్రి పూట గస్తీ పెంచాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## టీజీ-సెట్ సర్టిఫికెట్ల పంపిణీ ప్రారంభం

**రామంతపూర్, జూలై 12, (రాజముద్ర న్యూస్ ):** టీజీ–సెట్–2025 పరీక్షలు గత ఏడాది డిసెంబర్ 22, 23, 24 తేదీలలో నిర్వహించగా, ఫలితాలను 2026 మార్చి 20న విడుదల చేశారు. ఈ పరీక్షల్లో మొత్తం 2,565 మంది అభ్యర్థులు అర్హత సాధించారు. అర్హత పొందిన అభ్యర్థులకు టీజీ–సెట్ సర్టిఫికెట్ల పంపిణీ జూలై 10 నుంచి ప్రారంభమైనట్లు టీజీ–సెట్ కార్యాలయం తెలిపింది. హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయం టీజీ–సెట్ కార్యాలయంలో ప్రతి పని దినం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు సర్టిఫికెట్లు అందజేస్తున్నారు. అభ్యర్థులు తప్పనిసరిగా స్వయంగా హాజరై సర్టిఫికెట్ తీసుకోవాలని సూచించారు. సర్టిఫికెట్ పొందేందుకు ఒరిజినల్ అక్నాలెడ్జ్మెంట్ స్లిప్‌తో పాటు పెండింగ్‌లో ఉన్న పత్రాలు ఉంటే వాటిని తీసుకురావాలని టీజీ–సెట్ మెంబర్ సెక్రటరీ ప్రొఫెసర్ బి. శ్రీనివాస్ తెలిపారు



# ఈ నెల 15న హైదరాబాద్‌లో జరిగే నిరుద్యోగ ధర్నాను జయప్రదం చేయాలి

## రాష్ట్రంలోని ఖాళీ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలి : డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బొడ్డు మధు

**ఖమ్మం, రాజముద్ర న్యూస్:**

రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని, నిరుద్యోగ యువత సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 15న హైదరాబాద్‌లో నిర్వహించనున్న నిరుద్యోగ ధర్నాను జయప్రదం చేయాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) ఖమ్మం జిల్లా కార్యదర్శి బొడ్డు మధు పిలుపునిచ్చారు.

డీవైఎఫ్ఐ నేలకొండపల్లి మండల మహాసభ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వేలాది మంది యువత ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారని, ప్రభుత్వం వెంటనే స్పందించి ఖాళీ పోస్టులను భర్తీ చేయడంతో పాటు నిరుద్యోగ సమస్య పరిష్కారానికి సమగ్ర చర్యలు చేపట్టాలని కోరారు. యువత హక్కుల సాధన కోసం నిర్వహించే ఈ నిరుద్యోగ ధర్నాలో యువతీ యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) యువత సమస్యల పరిష్కారం కోసం పనిచేసే సంఘమని, యువతకు విద్య, ఉపాధి అవకాశాలు కల్పించడం, నిరుద్యోగ సమస్యపై పోరాటం చేయడం,



# అడవి పందుల అక్రమ రవాణా భగ్నం

- నేలకొండపల్లి ఎస్.ఐ శ్రీనివాస్ రెడ్డి దాడి
- 7 పందులు, వాహనం సీజ్.. ఫారెస్ట్ కు అప్పగింత

**ఖమ్మం రాజముద్ర న్యూస్:**




అడవి జంతువులను అక్రమంగా వేటాడి రవాణా చేస్తున్న ముఠాను నేలకొండపల్లి పోలీసులు పట్టుకున్నారు. ఈ దాడిలో 7 అడవి పందులు, ఒక టాటా ఏస్ వాహనంతో పాటు వేటకు ఉపయోగించిన పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. నేలకొండపల్లి ఎస్.ఐ పి. శ్రీనివాస్ రెడ్డి తమ సిబ్బందితో శుక్రవారం రాత్రి మండలంలో గస్తీ నిర్వహిస్తుండగా చెరువు మాదారం గ్రామంలోని ఖాళీ స్థలంలో అనుమానాస్పదంగా నిలిపి ఉన్న టాటా ఏసి TS29TB9282 వాహనాన్ని చూసి ఆపి తనిఖీ చేశారు.వాహనంలోపలి దృశ్యం చూసి అధికారులు సైతం షాక్ అయ్యారు. అడవి పందులను కాళ్లు, చేతులు తాళ్లతో బంధించి క్రూరంగా ఉంచగా, మరో 2 పందులను అప్పటికే చంపి మాంసం కోసం సిద్ధంగా ఉంచారు. వాటి పక్కనే కత్తులు, కట్టు కూడా ఉన్నాయి.పోలీసులు డ్రైవర్ ను విచారించగా అతను సూర్యాపేట జిల్లా, చిలుకూరు మండలం, చిలుకూరు గ్రామానికి చెందిన పుట్టబంతి నాగయ్య @ నాగరాజు గా గుర్తించారు. తన భార్య లక్ష్మి పేరుతో ఉన్న వాహనాన్ని కిరాయికి నడుపుతానని చెప్పాడు.విచారణలో నిందితుడు కీలక విషయాలు వెల్లడించాడు. 11-07-2026 న మెదక్ జిల్లా సదాస్‌పేట గ్రామంలో శ్రీనివాస్ అనే వ్యక్తి వద్ద నుండి ఎలాంటి అనుమతులు లేకుండా 7 అడవి పందులను చౌకగా కొన్నట్లు ఒప్పుకున్నాడు. వాటిని నేలకొండపల్లికి తీసుకొచ్చి ఇక్కడ మాంసంగా కోసి ఎక్కువ ధరకు అమ్మి లాభాలు గడించాలని పథకం వేశానని తెలిపాడు.నిందితుడిని అదుపులోకి తీసుకున్న ఎస్.ఐ శ్రీనివాస్ రెడ్డి, వాహనం, 7 పందులు, వేట పరికరాలను సీజ్ చేసి పంచనామా చేశారు. వన్యప్రాణి సంరక్షణ చట్టం ప్రకారం తదుపరి చర్యల కోసం కేసును ఫారెస్ట్ శాఖ అధికారులకు అప్పగించారు.అడవి జంతువుల వేట, అక్రమ రవాణాకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపుతామని, సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని ఎస్.ఐ హెచ్చరించారు.



# "సింగరేణి భరోసా యాత్ర"ను విజయవంతం చేయాలి

## బీజేపీ నేలకొండపల్లి మండల అధ్యక్షులు పాగర్తి సుధాకర్

**ఖమ్మం, రాజముద్ర న్యూస్:**

కేంద్ర బొగ్గు & గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి నాయకత్వంలో, తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు సమక్షంలో నిర్వహిస్తున్న "సింగరేణి భరోసా యాత్ర"ను విజయవంతం చేయాలని బీజేపీ నేలకొండపల్లి మండల పార్టీ శ్రేణులకు బీజేపీ నేలకొండపల్లి మండల అధ్యక్షులు పాగర్తి సుధాకర్ పిలుపునిచ్చారు.శనివారం నేలకొండపల్లి మండల బీజేపీ కార్యాలయంలో జరిగిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సింగరేణి కార్మికుల సంక్షేమం, ఉద్యోగ భద్రత, పారదర్శక పరిపాలన, బొగ్గు పరిశ్రమ అభివృద్ధి మరియు తెలంగాణ ప్రజల ఆకాంక్షల సాధనే ఈ యాత్ర ప్రధాన లక్ష్యమని తెలిపారు.ప్రతి సింగరేణి కార్మికుడికి బీజేపీ అండగా ఉంటుందని, వారి సమస్యల పరిష్కారానికి పార్టీ కట్టుబడి ఉందనే సందేశాన్ని ఈ యాత్ర ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్తామని పాగర్తి సుధాకర్ అన్నారు."సింగరేణి బలోపేతమే తెలంగాణ అభివృద్ధికి పునాది. సింగరేణి కార్మికుడే దేశ ప్రగతికి వెన్నెముక" అని ఆయన పేర్కొన్నారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పర్యటనను ప్రతి బూత్ స్థాయి కార్యకర్త బాధ్యతగా తీసుకొని విజయవంతం చేయాలని, కార్మికులను కలిసి వారి సమస్యలను తెలుసుకొని పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లాలని ఆయన సూచించారు.

ఈ సమావేశంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శులు, ఉపాధ్యక్షులు, మండల నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# పి సి ఎల్ -6 క్రికెట్ టోర్నమెంట్ జట్టుకు బలరామ్ యాదవ్ ఆర్థిక సహాయం

## క్రీడలు యువతలో క్రమశిక్షణ పెంపొందిస్తాయి: కాంగ్రెస్ సీనియర్ లీడర్ బలరామ్ యాదవ్



**శ్రీరామ్ నగర్, రాజముద్ర న్యూస్ :**

ఉప్పల్‌లో జరుగుతున్న ప్రతిష్టాత్మక పి సి ఎల్ -6 క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొంటున్న మియాపూర్ ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ జట్టుకు కాంగ్రెస్ సీనియర్ లీడర్ బలరామ్ యాదవ్ ఆర్థిక తోడ్పాటు అందించారు. ఈ సందర్భంగా పానుగంటి గణేష్ ఆధ్వర్యంలో అసోసియేషన్ ప్రతినిధులు బలరామ్ యాదవ్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. బలరామ్ యాదవ్ మాట్లాడుతూ... క్రీడలు యువతలో క్రమశిక్షణను, ఉత్సాహాన్ని నింపుతాయన్నారు. స్థానిక అసోసియేషన్ జట్టు టోర్నమెంట్‌లో విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ రూ. 10,000 చెక్కును అందజేశారు.ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు క్రీడాకారులు పాల్గొన్నారు.

# హబ్సిగూడ పెద్దచెరువు సుందరీకరణకు రూ. 19 కోట్ల నిధుల మంజూరుపై కృతజ్ఞత సభ





**రామంతపూర్, జూలై 12:( రాజముద్ర న్యూస్):**

హబ్సిగూడ–రామంతపూర్ పెద్దచెరువు సుందరీకరణ కోసం రూ.19 కోట్ల నిధులు మంజూరు చేయించిన సందర్భంగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం హబ్సిగూడ స్ట్రీట్ నం.8లోని పెద్ద చెరువు సమీపంలో కృతజ్ఞత సభ నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, పెద్దచెరువు అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. సుందరీకరణ పనులు పూర్తయిన అనంతరం ప్రజలకు మెరుగైన వాతావరణం, పర్యావరణ పరిరక్షణతో పాటు నడక మార్గాలు, విశ్రాంతి సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు.

కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గంధం జోత్స్న, నాగేశ్వరావు గారు , డాక్టర్ చారి గారు, మద్దూరి శ్రీనివాస్ గారు మహిళా నాయకులు, ప్రజాప్రతినిధులు, ఉద్యమకారులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేశారు. పెద్దచెరువు అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని పలువురు నాయకులు ఆకాంక్షించారు.

## దాతలూ...ఆర్థిక సాయంతో ఆదుకోండి

- హిందీ ఉపాధ్యాయుడి వేడుకోలు



**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :**

బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో హైదరాబాద్ యశోద హాస్పటల్‌లో తన సతీమణి చికిత్స పొందుతోందని, ఆర్థికంగా దాతలు ఆదుకోవాలని నేలకొండపల్లి మండలంలోని నాచేపల్లి జెడ్పీహెచ్ఎస్ హిందీ ఉపాధ్యాయుడు గద్దపాటి శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. వైద్య చికిత్సకు భారీ మొత్తంలో ఖర్చు అవుతోందని, ప్రతివారం సుమారు రూ.2, 20,000/- విలువైన ఇంజెక్షన్‌ను 18 వారాలు ఇవ్వాల్సిన పరిస్థితి ఉందని తెలిపారు. ఇంత ఖర్చు భరించడానికి తన శాయశక్తులా ప్రయత్నం చేసినా, ఆర్థికపరమైన లోటు ఇంకా ఎదుర్కోవలసి వచ్చిందని, ఈ క్లిష్ట సమయంలో తమ కుటుంబానికి అండగా నిలిచి, చేతనైన మేరకు ఆర్థిక సహాయం అందించాలని కోరారు. 99516 60789 నెంబర్‌కు ఫోన్పే / గూగుల్ పే / యూపీఐ ద్వారా సహాయం చేయవచ్చని విజ్ఞప్తి చేశారు. మీరు అందించే ప్రతి చిన్న సహాయం తమ కుటుంబానికి ఎంతో విలువైందని, దయచేసి దాతృత్వంతో సహాయపడాలని వేడుకుంటున్నారు. దాతలు ఆదుకోవాలని గద్దపాటి శ్రీనివాస్‌తో పాటు ఆయన కుటుంబీకులు, స్నేహితులు కూడా విజ్ఞప్తి చేశారు.




## జిల్లాలో క్రీడా సంస్కృతిని పెంపొందించాలి

### యువజన క్రీడాశాఖ అధికారి వి. శ్రీనివాస్ గౌడ్



**కరీంనగర్, జూలై 12:**

జిల్లాలో క్రీడా సంస్కృతిని పెంపొందించాల్సిన బాధ్యత వ్యాయామ ఉపాధ్యాయులపై ఉందని జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి వి. శ్రీనివాస్ గౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రాంతీయ క్రీడా పాఠశాలలో నిర్వహించిన 'స్పోర్ట్స్ నాలెడ్జ్ ఆన్ వీల్స్' కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్పోర్ట్స్ యూనివర్సిటీ కార్యక్రమంలో భాగంగా ఈ శిక్షణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయులు, కోచ్‌ల శిక్షణ ద్వారానే విద్యార్థులు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులుగా ఎదుగుతారని పేర్కొన్నారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణకు చెందిన కోచ్ విశాల్ మాట్లాడుతూ శిక్షణకు ముందు చేయాల్సిన వార్మప్, అనంతరం నిర్వహించాల్సిన కూల్‌డౌన్ వ్యాయామాలపై అవగాహన కల్పించారు. విద్యార్థుల శారీరక సామర్థ్యాన్ని బట్టి వారికి అనువైన క్రీడను ఎంపిక చేయాలని సూచించారు. మరో కోచ్ పాఠశాలల్లో చిన్నారులకు నిర్వహించాల్సిన క్రీడలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఫిజియోథెరపిస్ట్ కృష్ణ ప్రసాద్ క్రీడల సమయంలో విద్యార్థులకు తలెత్తే గాయాలు, వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఫుట్‌బాల్ కోచ్ రహీం, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు ఆడపు శ్రీనివాస్, ఏ. శంకరయ్య, జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి బి. వేణుగోపాల్, హెచ్‌ఎం శ్రీనివాస్, వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు, క్రీడా పాఠశాల కోచ్‌లు, జిల్లాలోని సుమారు 100 మంది వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు, అధికారులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ డిజిటలైజేషన్‌ను పరిశీలించిన కలెక్టర్



- కుంటాల, ముధోల్ మండలాల్లో ఆకస్మిక తనిఖీలు
- గడువులోగా ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశం
- పారదర్శకంగా నమోదు చేపట్టాలని సూచన

**నిర్మల్, జూలై 12 :**

జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా ఆదివారం కుంటాల, ముధోల్ మండలాల్లో ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ఎన్యుమరేషన్ డిజిటలైజేషన్ ప్రక్రియను పరిశీలించారు. గ్రామపంచాయతీ కార్యాలయాలను సందర్శించి ఆన్‌లైన్ నమోదు, రికార్డుల నిర్వహణ తీరును తనిఖీ చేశారు. కుంటాల మండలంలోని కల్లూరు, ముధోల్ మండలంలోని తరోడ గ్రామపంచాయతీ కార్యాలయాలను సందర్శించిన కలెక్టర్, డిజిటలైజేషన్ ప్రక్రియ పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. నమోదు ప్రక్రియలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా ప్రతి వివరాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తూ పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఆన్‌లైన్ నమోదు, రికార్డుల నిర్వహణలో ఖచ్చితత్వం పాటిస్తూ ప్రతి దశను జాగ్రత్తగా అమలు చేయాలని స్పష్టం చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరి వివరాలు సక్రమంగా నమోదు కావడంతో పాటు ఎలాంటి ఫిర్యాదులకు తావు లేకుండా అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ప్రజలకు అవసరమైన సహాయం అందిస్తూ ప్రక్రియను వేగవంతం చేయాలని పేర్కొన్నారు. ఈ తనిఖీల సందర్భంగా తహసీల్దార్లు కమల్ సింగ్, శ్రీలత, తరోడ సర్పంచ్ అరిపుద్దీన్‌తో పాటు ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. డిజిటలైజేషన్ పనుల పురోగతిని అధికారులు కలెక్టర్‌కు వివరించారు.

## అరుణోదయ నాగన్న ఆశయాలను కొనసాగిస్తాం: ఐ. వెంకన్న



**ఖమ్మం రాజముద్ర న్యూస్**

కామ్రేడ్ అరుణోదయ నాగన్న సంతాప సభ ఈరోజు కూసుమంచిలో పార్టీ సీనియర్ నాయకులు మాతంగి రామస్వామి అధ్యక్షతన ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ కూసుమంచి సబ్ డివిజన్ కార్యదర్శి ఐ. వెంకన్న మాట్లాడుతూ, కామ్రేడ్ అరుణోదయ నాగన్న ఐదు దశాబ్దాలుగా విప్లవోద్యమ, సాహిత్య, సాంస్కృతిక రంగాలలో అవిశ్రాంతంగా పనిచేసిన మహా నాయకుడని కొనియాడారు. "తన మధుర గానంతో లక్షలాది మంది ప్రజల మెదడులను కదిలించారు. ఆట, పాటలతో కోట్లాది రూపాయలు సంపాదించుకునే అవకాశం ఉన్నా, 'కళ కళ కోసం కాదు ప్రజల కోసం' అంటూ తన జీవితాంతం పేద ప్రజల పక్షాన, పాలకవర్గాలకు వ్యతిరేకంగా గళం వినిపించిన ధన్యజీవి నాగన్న" అని అన్నారు.కామ్రేడ్ నాగన్న పార్టీ క్రమశిక్షణ గల రాష్ట్ర నాయకుడిగా, గాయకుడిగా, రచయితగా, ఆదర్శ కమ్యూనిస్టుగా జీవించారని గుర్తు చేశారు. "అప్రజాస్వామికంగా ఇరాక్ పై దాడి చేసి ఆ దేశ అధ్యక్షుడు సద్దాం హుస్సేన్ ను ఉరితీసిన అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా 'సద్దాం హుస్సేన్ నీకు లాల్ సలాములు' అంటూ పాడిన పాట ప్రపంచ ప్రజాస్వామ్యవాదులను ఆలోచింపజేసింది" అని పేర్కొన్నారు.ప్రస్తుతం దేశంలో వేగంగా ముందుకు వస్తున్న ఫాసిజానికి వ్యతిరేకంగా ప్రజలు ఐక్యంగా ఉద్యమించడమే నాగన్నకు మనం అర్పించే నిజమైన నివాళి అని ఆయన పిలుపునిచ్చారు.

**రేపు రాజారంలో భారీ సంతాప సభ**

కామ్రేడ్ నాగన్న సంతాప సభను సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రేపు 13.07.2026న ఉదయం 10:00 గంటలకు నాగన్న స్వగ్రామం తిరుమలాయపాలెం మండలం, రాజారం గ్రామంలో నిర్వహిస్తున్నాము.

ఈ సభకు గాయకులు, రచయితలు, ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు, నాగన్న అభిమానులు అందరూ పాల్గొని సభను జయప్రదం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో అఖిల భారత రైతు కూలీ సంఘం కూసుమంచి మండల ప్రధాన కార్యదర్శి చెరుకుపల్లి వీరయ్య, పార్టీ డివిజన్ నాయకులు బుర్ర సైదులు, ఐఎఫ్టియు జిల్లా నాయకులు గోపి, రవి, కాంపాటి మధు, కూసుమంచి మండల అధ్యక్షులు కనకం గోపయ్య, లింగ, రైతు సంఘం నాయకులు బుల్లి, కొండ, వీరయ్య, తదితరులు పాల్గొన్నారు.



## ఆయిల్ పామ్ సాగుకు ప్రోత్సాహం

- రాయితీలను సద్వినియోగం చేసుకోవాలి
- 2,000 ఎకరాల సాగు లక్ష్యం
- రైతులకు జిల్లా కలెక్టర్ పిలుపు



**జోగులాంబ గద్వాల, జూలై 12 :**

జిల్లాలో ఆయిల్ పామ్ తోటల సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పిలుపునిచ్చారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో 2,000 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగును లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. బీచుపల్లి వద్ద ఉన్న తెలంగాణ రాష్ట్ర నూనె ఉత్పత్తి సహకార సంఘం ద్వారా రైతులకు అవసరమైన ఆయిల్ పామ్ మొక్కలను సిద్ధంగా ఉంచినట్లు కలెక్టర్ వెల్లడించారు. ఎకరాకు 57 మొక్కలు నాటుకోవచ్చని, ఒక్కో మొక్క ధర రూ.193 కాగా రైతులు కేవలం రూ.20 మాత్రమే చెల్లిస్తే సరిపోతుందని తెలిపారు. మిగిలిన మొత్తాన్ని ప్రభుత్వం భరిస్తుందని పేర్కొన్నారు. ఆయిల్ పామ్ సాగులో బిందు సేద్యానికి కూడా ప్రభుత్వం భారీ రాయితీలు అందిస్తోందన్నారు. ఐదు హెక్టార్ల వరకు ఎస్సీ, ఎస్టీ రైతులకు 90 శాతం, బీసీ రైతులకు 80 శాతం, ఇతర రైతులకు 70 శాతం సబ్సిడీతో బిందు సేద్య పరికరాలు అందజేస్తామని వివరించారు.

జిల్లాలో ఇప్పటివరకు 1,777 మంది రైతులు 7,164.72 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేపట్టారని కలెక్టర్ తెలిపారు. ఇందులో 349 మంది రైతులు 2,014.53 ఎకరాల్లో సాగు చేసి 4,619.64 టన్నుల దిగుబడిని సాధించినట్లు చెప్పారు. ఈ పంట ద్వారా రైతులకు గణనీయమైన ఆదాయం లభించిందని పేర్కొన్నారు. ఆయిల్ పామ్ సాగుకు దరఖాస్తు చేసుకునే రైతుల భూమి, నీటి లభ్యత, విద్యుత్ సౌకర్యాలను ఉద్యానవన శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించిన అనంతరం ప్రాధాన్యత క్రమంలో మొక్కలు పంపిణీ చేస్తారని తెలిపారు. రైతులు సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారి వద్ద దరఖాస్తులు పొందించి అవసరమైన పత్రాలతో సమర్పించాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం జిల్లా ఉద్యానవన శాఖ అధికారులను సంప్రదించాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ కోరారు.

## భూసేకరణ పనులు వేగవంతం చేయాలి

- జాతీయ రహదారులు, సాగునీటి ప్రాజెక్టులపై సమీక్ష
- నిర్ణీత గడువులో పనులు పూర్తి చేయాలని ఆదేశం
- అధికారులతో జిల్లా కలెక్టర్ సమావేశం

**మహబూబ్‌నగర్, జూలై 12 :**

జిల్లాలో జాతీయ రహదారులు, సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులో పూర్తి చేయాలని మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి పనుల పురోగతిని పరిశీలించారు. సమావేశంలో భారత్‌మాల జాతీయ రహదారి ప్రాజెక్టుతో పాటు కల్వకుర్తి ఎత్తిపోతల పథకం, పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, రాజీవ్ భీమా పథకం, కోయిల్ సాగర్ ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ పనులపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన కీలక ప్రాజెక్టులు ఆలస్యం కాకుండా భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. భూసేకరణలో ఎదురవుతున్న సమస్యలను వెంటనే పరిష్కరించి, పనుల్లో జాప్యం లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. భూసేకరణ ప్రక్రియలో నిబంధనలను పూర్తిగా పాటిస్తూ భూ యజమానులతో సమన్వయం చేసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. అర్హులైన వారికి చట్టప్రకారం పరిహారం అందేలా చర్యలు తీసుకోవడంతో పాటు పెండింగ్‌లో ఉన్న అంశాలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. జిల్లాలో అమలవుతున్న ఈ ప్రాజెక్టులు పూర్తయితే రవాణా, సాగునీరు, వ్యవసాయ రంగాలకు గణనీయమైన ప్రయోజనం కలుగుతుందని కలెక్టర్ తెలిపారు. ప్రజలకు మేలు చేసే అభివృద్ధి పనులు నిర్ణీత గడువులో పూర్తి కావడానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. సమీక్ష సమావేశంలో రెవెన్యూ, జాతీయ రహదారులు, సాగునీటి శాఖలకు చెందిన అధికారులు పాల్గొని భూసేకరణ పనుల పురోగతిని కలెక్టర్‌కు వివరించారు. పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ లక్ష్యాలను సమయానికి పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు.

## బాల కార్మిక వ్యవస్థపై ఉక్కుపాదం

- 10 రోజుల్లో 34 మంది చిన్నారుల రక్షణ
- 22 కేసులు నమోదు చేసిన మెదక్ పోలీసులు

**మెదక్, జూలై 12 :**

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనే లక్ష్యంగా చేపట్టిన ఆపరేషన్ ముస్కాన్–12లో మెదక్ జిల్లా పోలీసులు కీలక పురోగతి సాధించారు. గత పది రోజుల్లో వివిధ ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించి 34 మంది బాల కార్మికులను రక్షించగా, బాల కార్మికులను పనిలో పెట్టుకున్న వారిపై 22 కేసులు నమోదు చేశారు. పిల్లల చేతుల్లో పనిముట్లు కాకుండా పుస్తకాలు ఉండాలన్న లక్ష్యంతో జిల్లా పోలీసులు, సంబంధిత శాఖల అధికారులు సంయుక్తంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. హోటళ్లు, దుకాణాలు, పరిశ్రమలు, వాణిజ్య సంస్థల్లో పనిచేస్తున్న చిన్నారులను గుర్తించి వారికి రక్షణ కల్పించారు. బాల కార్మికులను పనిలో పెట్టుకోవడం చట్టరీత్యా నేరమని పోలీసులు హెచ్చరించారు. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# లార్డ్స్‌లో యస్తికా చరిత్ర



## టెస్ట్ శతకంతో తొలి మహిళా క్రికెటర్‌గా అరుదైన ఘనత

## గాయం నుంచి కోలుకుని పునరాగమన మ్యాచ్‌లోనే సెంచరీ

## లార్డ్స్ ఆనర్స్ బోర్డులో భారత క్రికెటర్ పేరు

**భారత మహిళా వికెట్ కీపర్-బ్యాటర్ యస్తికా భాటియా చారిత్రక ఇన్నింగ్స్‌తో లార్డ్స్ మైదానంలో అరుదైన రికార్డు సృష్టించింది. ఇంగ్లండ్‌తో జరుగుతున్న ఏకైక టెస్ట్ మ్యాచ్‌లో శతకం సాధించి, లార్డ్స్‌లో టెస్ట్ సెంచరీ చేసిన తొలి మహిళా క్రికెటర్‌గా నిలిచింది.**

**లండన్:** భారత మహిళా వికెట్ కీపర్-బ్యాటర్ యస్తికా భాటియా చారిత్రక ఇన్నింగ్స్‌తో లార్డ్స్ మైదానంలో అరుదైన రికార్డు సృష్టించింది. ఇంగ్లండ్‌తో జరుగుతున్న ఏకైక టెస్ట్ మ్యాచ్‌లో శతకం సాధించి, లార్డ్స్‌లో టెస్ట్ సెంచరీ చేసిన తొలి మహిళా క్రికెటర్‌గా నిలిచింది. మూడో రోజు లంచ్ విరామానికి 91 పరుగులతో క్రీజులో ఉన్న యస్తికా, విరామం అనంతరం కూడా అదే జోరును కొనసాగించింది. ఇస్సీ వాంగ్ బౌలింగ్‌లో వరుసగా రెండు ఫోర్లు బాదిన ఆమె, ఆపై సింగిల్‌తో తన తొలి అంతర్జాతీయ టెస్ట్ శతకాన్ని పూర్తి చేసింది. 145 బంతుల్లో 12 ఫోర్ల సహాయంతో ఈ సెంచరీ నమోదు చేసింది. శతకం పూర్తికాగానే భావోద్వేగానికి గురైన యస్తికా మైదానంలో మోకాళ్లపై కూర్చొని పిచ్‌ను ముద్దాడగా, ప్రేక్షకులంతా లేచి నిలబడి చప్పట్లతో ఆమెను అభినందించారు. మోకాలి ఏసీఎల్ గాయంతో కొంతకాలం క్రికెట్‌కు దూరమైన యస్తికా, ఈ ఇంగ్లండ్ పర్యటన ద్వారానే అంతర్జాతీయ క్రికెట్‌లోకి తిరిగి అడుగుపెట్టింది. పునరాగమన మ్యాచ్‌లోనే చారిత్రక శతకం బాది తన సత్తాను మరోసారి నిరూపించింది. ఇన్నింగ్స్ తొలి బంతికే లారెన్ బెల్ బౌలింగ్‌లో వికెట్లను బంతి తాకినా బెయిల్స్ కిందపడకపోవడంతో ఆమెకు అదృష్టం కలిసి వచ్చింది. ఆ అవకాశాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకుని అద్భుత ఇన్నింగ్స్ ఆడింది. ఇదే మ్యాచ్‌లో ఐదు వికెట్లు తీసి ఇప్పటికే లార్డ్స్ ఆనర్స్ బోర్డులో చోటు దక్కించుకున్న భారత బౌలర్ క్రాంతి గౌడ్ సరసన, యస్తికా కూడా టెస్ట్ శతకంతో తన పేరును లార్డ్స్ చరిత్రలో చిరస్థాయిగా నిలిపింది.



# పరాజయాల్లో టీమిండియా చెత్త రికార్డు

ఇంగ్లండ్ పర్యటనలో టీమిండియా మరోసారి నిరాశపరిచింది. సౌతాంప్టన్ వేదికగా జరిగిన చివరి టీ20 మ్యాచ్‌లో ఇంగ్లండ్ 56 పరుగుల తేడాతో భారత్‌ను ఓడించింది. దీంతో టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో పరుగుల పరంగా భారత్ ఎదుర్కొన్న అతిపెద్ద పరాజయాల్లో ఈ ఓటమి నాలుగో స్థానంలో నిలిచింది. టీ20ల్లో భారత్‌కు అత్యంత భారీ ఓటమి 2026లో నాటింగ్‌హామ్‌లో ఇంగ్లండ్ చేతిలో 125 పరుగుల తేడాతో నమోదైంది. అనంతరం 2019లో వెల్లింగ్టన్‌లో న్యూజిలాండ్ చేతిలో 80 పరుగుల తేడాతో, 2026లో అహ్మదాబాద్‌లో దక్షిణాఫ్రికా చేతిలో 76 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. తాజాగా సౌతాంప్టన్‌లో ఇంగ్లండ్‌పై 56 పరుగుల తేడాతో ఓడిపోవడంతో ఈ పరాజయం నాలుగో అతిపెద్ద ఓటమిగా నమోదైంది. 2025లో న్యూ చండీగఢ్‌లో దక్షిణాఫ్రికా చేతిలో 51 పరుగుల తేడాతో ఎదురైన ఓటమి ఈ జాబితాలో తర్వాతి స్థానంలో ఉంది. ఈ ఇంగ్లండ్ పర్యటనలో భారత్ మరో అవాంఛనీయ రికార్డును కూడా తన పేరిట నమోదు చేసుకుంది. ఒకే టీ20 సిరీస్ లేదా టోర్నమెంట్‌లో నాలుగు మ్యాచ్‌ల్లో ఓడిపోవడం భారత టీ20 చరిత్రలో ఇదే తొలిసారి. గతంలో 2009లో ఇంగ్లండ్‌లో జరిగిన టీ20 ప్రపంచకప్‌లో మూడు మ్యాచ్‌లు, 2010లో వెస్టిండీస్‌లో జరిగిన టీ20 ప్రపంచకప్‌లో మూడు మ్యాచ్‌లు, 2023లో వెస్టిండీస్ పర్యటనలో మూడు మ్యాచ్‌లు మాత్రమే భారత్ ఓడిపోయింది. ఇప్పుడు ఇంగ్లండ్ పర్యటనలో నాలుగు పరాజయాలతో ఆ చెత్త రికార్డును అధిగమించింది. టీ20 ప్రపంచకప్ విజేతగా బరిలోకి దిగిన భారత జట్టు ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటనల్లో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయింది. వరుస పరాజయాలతో జట్టు ప్రదర్శనపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆటగాళ్ల ఎంపిక, వ్యూహాలు, నాయకత్వంపై సోషల్ మీడియాలో అభిమానులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. జట్టులో మార్పులు అవసరమని, రాబోయే సిరీస్‌లలో మెరుగైన ప్రదర్శనతో ఈ వైఫల్యాల నుంచి బయటపడాలని మాజీ క్రికెటర్లు, అభిమానులు అభిప్రాయపడుతున్నారు.

# లార్డ్స్‌లో క్రాంతి గౌడ్ చరిత్ర..


## ఐదు వికెట్లతో అరుదైన ఘనత



భారత మహిళా క్రికెట్ జట్టు యువ పేసర్ క్రాంతి గౌడ్ లార్డ్స్ మైదానంలో చరిత్ర సృష్టించింది. ఇంగ్లండ్‌తో జరుగుతున్న ఏకైక టెస్టులో ఐదు వికెట్లు పడగొట్టి, లార్డ్స్‌లో టెస్టు క్రికెట్‌లో ఐదు వికెట్లు సాధించిన తొలి మహిళా బౌలర్‌గా నిలిచింది. అలాగే ఈ చారిత్రక మైదానంలో ఏ ఫార్మాట్‌లోనైనా ఐదు వికెట్ల ఘనత సాధించిన తొలి భారత మహిళా క్రికెటర్‌గా కూడా రికార్డు నెలకొల్పింది. కెరీర్‌లో రెండో టెస్టు మాత్రమే ఆడుతున్న 22 ఏళ్ల క్రాంతి గౌడ్ అద్భుత బౌలింగ్‌తో ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌ను కుప్పకూల్చింది. 35 పరుగులకే ఐదు వికెట్లు తీసిన ఆమె ధాటికి ఇంగ్లండ్ 170 పరుగులకు ఆలౌటైంది. దీంతో భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 115 పరుగుల కీలక ఆధిక్యాన్ని సంపాదించింది. రెండో రోజు ఆట ప్రారంభమైన వెంటనే క్రాంతి తన జోరును కొనసాగించింది. మయా బౌచియర్‌ను ఔట్ చేసిన ఆమె, తొలి రోజు టామీ బ్యూమాంట్‌ను ఎల్బీడబ్ల్యూగా వెనక్కి పంపింది. అనంతరం అలీస్ క్యాప్సీని అద్భుత బంతితో బౌల్డ్ చేసి ఇంగ్లండ్‌ను మరింత ఒత్తిడిలోకి నెట్టింది. హీథర్ నైట్ కూడా త్వరగా ఔట్ కావడంతో ఆతిథ్య జట్టు 32 పరుగులకే మూడు కీలక వికెట్లు కోల్పోయింది. నాట్ స్కివర్-బ్రంట్, అమీ జోన్స్ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే ప్రయత్నం చేసినా, అమీ జోన్స్‌ను స్నేహ్ రాణా ఔట్ చేయడంతో ఆ భాగస్వామ్యానికి తెరపడింది. అనంతరం లంచ్ తర్వాత బౌలింగ్‌కు వచ్చిన క్రాంతి గౌడ్ ఇంగ్లండ్ కెప్టెన్ నాట్ స్కివర్-బ్రంట్‌ను పెవిలియన్‌కు పంపింది. చివరగా లారెన్ బెల్ వికెట్‌తో తన ఐదు వికెట్ల ఘనతను పూర్తి చేసి లార్డ్స్ ఆనర్స్ బోర్డులో చోటు సంపాదించింది. రెండో ఇన్నింగ్స్‌లో భారత బ్యాటర్లు కూడా ఆధిపత్యం కొనసాగించారు. స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన అర్ధశతకంతో రాణించగా, షఫాలీ వర్మ 33 పరుగులు చేసింది. రెండో రోజు ఆట ముగిసే సమయానికి మంధాన 69 పరుగులతో, యస్తికా భాటియా 39 పరుగులతో అజేయంగా నిలిచారు. దీంతో భారత్ ఆధిక్యం 269 పరుగులకు చేరుకుంది. మూడో రోజు మరింత భారీ ఆధిక్యాన్ని సాధించి ఇంగ్లండ్‌పై చారిత్రక విజయాన్ని నమోదు చేయాలని భారత మహిళల జట్టు లక్ష్యంగా పెట్టుకుంది.

# టీమిండియా మేనేజ్‌మెంట్‌పై కైఫ్ ఆగ్రహం

## ఎంపికల తీరుపై తీవ్ర విమర్శలు



ఇంగ్లండ్‌తో టీ20 సిరీస్‌లో భారత జట్టు 0-4 తేడాతో ఓటమిపాలైన నేపథ్యంలో మాజీ క్రికెటర్ మహ్మద్ కైఫ్ జట్టు మేనేజ్‌మెంట్‌పై తీవ్ర విమర్శలు గుప్పించాడు. భారత క్రికెట్ చరిత్రలో ఇంత గందరగోళంగా వ్యవహరించిన జట్టు యాజమాన్యాన్ని తాను చూడలేదని పేర్కొన్నాడు. ముఖ్యంగా సంజూ శాంసన్, యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీ విషయంలో అనుసరించిన విధానం సరైనది కాదని అభిప్రాయపడ్డాడు. టీ20 ప్రపంచకప్ విజేతగా ఇంగ్లండ్ పర్యటనకు వెళ్లిన భారత్, వరుస పరాజయాలతో తీవ్ర నిరాశకు గురైంది. తొలుత ఐర్లాండ్‌తో 0-2 తేడాతో సిరీస్ కోల్పోయిన జట్టు, అనంతరం ఇంగ్లండ్ చేతిలో 0-4తో క్లీన్‌స్వీప్‌కు గురైంది. ఈ ఫలితాలతో ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానాన్ని కూడా కోల్పోయింది. ఈ నేపథ్యంలో కైఫ్ తన 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ, ప్రపంచ స్థాయి ప్రతిభ ఉన్న ఆటగాళ్లకు ఆత్మవిశ్వాసం కల్పించాల్సిందిపోయి, వారి మనసుల్లో సందేహాలు నింపేలా జట్టు ఎంపికలు జరిగాయని విమర్శించాడు. సిరీస్‌లో తొలి మూడు మ్యాచ్‌లలో సంజూ శాంసన్‌కు అవకాశం ఇచ్చి, ఆ తర్వాత అతడిని తప్పించి వైభవ్ సూర్యవంశీని ఆడించారని, చివరి మ్యాచ్‌లో మళ్లీ వైభవ్‌ను పక్కనపెట్టి సంజూను తీసుకురావడం అర్థం కాని నిర్ణయమని పేర్కొన్నాడు. అదే సమయంలో జింబాబ్వే సిరీస్‌కు సంజూను ఎంపిక చేయకుండా వైభవ్‌ను కొనసాగించడం మరింత గందరగోళానికి దారితీసిందని వ్యాఖ్యానించాడు. ఇదే అంశంపై మాజీ క్రికెటర్ సంజయ్ మంజ్రేకర్ కూడా స్పందించాడు. కేవలం ఐపీఎల్ ప్రదర్శనల ఆధారంగా ఆటగాళ్లను ఎంపిక చేయడం సరైన పద్ధతి కాదని సెలక్టర్లకు సూచించాడు. విదేశీ పరిస్థితుల్లో రాణించే సామర్థ్యం ఉన్న ఆటగాళ్లను గుర్తించి అవకాశాలు ఇవ్వాలని, స్వదేశంలో మాత్రమే పరుగులు చేయడం సరిపోదని అభిప్రాయపడ్డాడు.



# టాస్‌లలో శ్రేయస్ రికార్డు

## ధోనీ సరసన చేరిన టీమిండియా కెప్టెన్

టీమిండియా టీ20 కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ అరుదైన రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. అంతర్జాతీయ టీ20ల్లో భారత కెప్టెన్‌గా వరుసగా అత్యధిక టాస్‌లు గెలిచిన సారథిగా మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ రికార్డును సమం చేశాడు. ఇంగ్లండ్‌తో సౌతాంప్టన్‌లో జరిగిన ఐదో టీ20లో టాస్ గెలవడంతో శ్రేయస్ వం-సగా ఏడో టాస్ విజయాన్ని నమోదు చేశాడు. 2010 నుంచి 2012 మధ్య ధోనీ భారత జట్టుకు నాయకత్వం వహిస్తూ వరుసగా ఏడు టీ20 మ్యాచ్‌ల్లో టాస్ గెలిచాడు. ఇప్పుడు శ్రేయస్ అయ్యర్ కూడా అదే ఘనత సాధించి ధోనీ సరసన అగ్రస్థానంలో నిలిచాడు. ఈ జాబితాలో విరాట్ కోహ్లీ వరుసగా ఆరు టాస్ విజయాలతో తర్వాతి స్థానంలో ఉండగా, ధోనీ మరోసారి 2007లో వరుసగా ఐదు టాస్‌లు గెలిచాడు. రోహిత్ శర్మ కూడా 2020 నుంచి 2022 మధ్య వరుసగా ఐదు టాస్ విజయాలు నమోదు చేశాడు. అయితే టాస్‌లలో అదృష్టం కలిసి వస్తున్నా, మ్యాచ్ ఫలితాలు మాత్రం శ్రేయస్‌కు అనుకూలంగా మారడం లేదు. సౌతాంప్టన్‌లోని రోజ్ బౌల్ వేదికగా జరిగిన ఐదో టీ20లో ఇంగ్లండ్ 56 పరుగుల తేడాతో భారత్‌ను ఓడించింది. దీంతో సౌతాంప్టన్‌లో ఇటీవల టీ20ల్లో ముందుగా బ్యాటింగ్ చేసిన జట్టే గెలుస్తున్న ఆనవాయితీ మరోసారి కొనసాగింది. 2021 నుంచి ఈ వేదికపై జరిగిన ఐదు టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌ల్లోనూ తొలుత బ్యాటింగ్ చేసిన జట్టే విజయం సాధించింది. కెప్టెన్‌గా శ్రేయస్ అయ్యర్ ఇప్పటివరకు ఆశించిన ఫలితాలు సాధించలేకపోయాడు. ఇప్పటివరకు ఏడు మ్యాచ్‌ల్లో సారథ్యం వహించగా, ఆరు మ్యాచ్‌ల్లో భారత్ ఓడిపోయింది. మరో మ్యాచ్ ఫలితం లేకుండానే ముగిసింది. అయితే మరో మ్యాచ్‌లో కూడా టాస్ గెలిస్తే వరుసగా ఎనిమిది టాస్ విజయాలతో భారత టీ20 కెప్టెన్లలో కొత్త రికార్డు నెలకొల్పే అవకాశం శ్రేయస్ అయ్యర్‌కు ఉంది.



# రిఫరీతో మెస్సీ వాగ్వాదం

## ప్రపంచకప్ మ్యాచ్‌లో ఉద్రిక్తత

**న్యూజెర్సీ, జులై 12:** 2026 ఫిఫా ప్రపంచకప్‌లో అర్జెంటీనా, స్విట్జర్లాండ్ మధ్య జరిగిన మ్యాచ్ ఉత్కంఠభరితంగా సాగడమే కాకుండా మైదానంలో తీవ్ర ఉద్రిక్తతకు కూడా వేదికైంది. అర్జెంటీనా కెప్టెన్ లియోనెల్ మెస్సీ, మ్యాచ్ రిఫరీ జోవావో పిన్హీరో మధ్య జరిగిన వాగ్వాదం ఫుట్‌బాల్ ప్రపంచంలో చర్చనీయాంశంగా మారింది. అదనపు సమయంలో అర్జెంటీనా విజయం సాధించినప్పటికీ, మెస్సీ ఆగ్రహావేశం మ్యాచ్‌లో ప్రధాన ఆకర్షణగా నిలిచింది. మొదటి అర్ధభాగంలో స్విట్జర్లాండ్‌కు ఫ్రీకిక్ లభించిన సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. అర్జెంటీనా ఏర్పాటు చేసిన రక్షణ గోడలో ఉన్న మెస్సీని నిబంధనల ప్రకారం కొంత వెనక్కి జరగాలని రిఫరీ సూచించారు. అయితే రిఫరీ మాట్లాడిన తీరుపై అసంతృప్తి వ్యక్తం చేసిన మెస్సీ, తనతో మర్యాదగా మాట్లాడాలని, అగౌరవంగా ప్రవర్తించవద్దంటూ గట్టిగా హెచ్చరించినట్లు వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. ఈ ప్రపంచకప్‌లో తొలిసారి గోల్ చేయడంలో విఫలమైన మెస్సీ మ్యాచ్ మొత్తం తీవ్ర ఒత్తిడిలో కనిపించాడు. స్విట్జర్లాండ్ ఆటగాళ్లు అతనిపై కట్టుదిట్టమైన మార్కింగ్ అమలు చేయడంతో ఆశించిన ప్రభావం చూపలేకపోయాడు. నిర్ణీత సమయంలో ఇరు జట్లు ఒక్కో గోల్‌తో సమంగా నిలవడంతో మ్యాచ్ అదనపు సమయానికి వెళ్లింది. మ్యాచ్‌లో మరో వివాదాస్పద ఘటన కూడా చోటుచేసుకుంది. వీడియో సమీక్ష అనంతరం డైవింగ్ చేసినట్లు గుర్తించిన రిఫరీ, స్విట్జర్లాండ్ ఆటగాడు బ్రీల్ ఎంభోలోకు రెడ్ కార్డ్ చూపించి మైదానం వీడేలా చేశారు. దీంతో స్విస్ జట్టు పది మంది ఆటగాళ్లతోనే పోరాడాల్సి వచ్చింది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్న అర్జెంటీనా అదనపు సమయంలో వరుసగా రెండు గోల్స్ చేసి 3-1 తేడాతో విజయాన్ని అందుకుంది. పోర్చుగల్‌కు చెందిన 38 ఏళ్ల జోవావో పిన్హీరో యూరప్‌లోని ప్రముఖ రిఫరీలలో ఒకరిగా గుర్తింపు పొందారు. 2015లో పోర్చుగీస్ అగ్రశ్రేణి లీగ్‌లో రిఫరీగా అరంగేట్రం చేసిన ఆయన, 2016లో ఫిఫా అంతర్జాతీయ గుర్తింపు పొందారు. యూరోపియన్ క్లబ్ టోర్నీలతో పాటు పలు ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ పోటీల్లో విధులు నిర్వహించిన అనుభవంతో 2026 ప్రపంచకప్‌కు ఎంపికయ్యారు. అయితే మెస్సీతో జరిగిన ఈ వాగ్వాదం కారణంగా ఆయన పేరు ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

# నటుడు ఆర్యపై మోసం కేసు నమోదు



**హైదరాబాద్, జులై 12 :** ప్రముఖ తమిళ నటుడు ఆర్యతో పాటు ఆయన నటిస్తున్న 'అనంతన్ కాడు'లిచిత్ర బృందంపై హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో మోసం కేసు నమోదైంది. సినిమా చిత్రీకరణ కోసం అద్దెకు తీసుకున్న అత్యాధునిక డిజిటల్ కెమెరాలు, లైటింగ్ పరికరాలకు సంబంధించిన రూ.1.80 కోట్లకు పైగా బకాయిలు చెల్లించకుండా మోసగించారని 'తాహెర్ సినీ టెక్నిక్' సంస్థ ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. బాధిత సంస్థ తెలిపిన వివరాల ప్రకారం, గత ఏడాది ఫిబ్రవరిలో 'అనంతన్ కాడు' సినిమా చిత్రీకరణ కోసం నటుడు ఆర్య, నిర్మాత వినోద్ తమ సంస్థను సంప్రదించి అత్యంత ఖరీదైన డిజిటల్ కెమెరాలు, లైటింగ్ పరికరాలను అద్దెకు తీసుకున్నారు. ఈ పరికరాల అద్దె మొత్తం రూ.2.12 కోట్లుగా నిర్ణయించగా, అందులో కొంత మొత్తం మాత్రమే చెల్లించి మిగిలిన రూ.1.80 కోట్లకు పైగా బకాయిలను ఇప్పటి వరకు చెల్లించలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. సినిమా విడుదలకు ముందు మొత్తం బకాయిలు చెల్లించి 'బకాయిలు లేవు' అనే ధ్రువీకరణ పత్రాన్ని తీసుకుంటామని చిత్ర బృందం లిఖితపూర్వకంగా హామీ ఇచ్చిందని సంస్థ ప్రతినిధులు తెలిపారు. అయితే ఆ తర్వాత పలుమార్లు సంప్రదించినప్పటికీ స్పందించలేదని, ఫోన్ కాల్స్, సందేశాలను కూడా పట్టించుకోకుండా తప్పించుకుంటున్నారని ఆరోపించారు. అంతేకాకుండా బకాయిల విషయమై మాట్లాడేందుకు వెళ్లిన తమ సంస్థ మేనేజర్‌ను నటుడు ఆర్య, నిర్మాత వినోద్, ఆర్య వ్యక్తిగత సహాయకుడు కిశోర్ కలిసి బెదిరింపులకు గురిచేశారని సంస్థ అకౌంటెంట్ జావేద్ అలీ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో వాస్తవాలను దాచిపెట్టి కేరళలోని న్యాయస్థానం నుంచి మధ్యంతర ఉత్తర్వులు కూడా పొందినట్లు సంస్థ ఆరోపించింది. ఫిర్యాదు ఆధారంగా జూబ్లీహిల్స్ పోలీసులు మోసం, బెదిరింపులకు సంబంధించిన వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన పత్రాలు, ఒప్పందాలు, చెల్లింపుల వివరాలను సేకరిస్తున్నట్లు సమాచారం. దర్యాప్తు అనంతరం తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు పోలీసులు తెలిపారు.

# 'ఐరన్ లెగ్' ముద్రపై భాగ్యశ్రీ ఆవేదన

టాలీవుడ్‌లో తక్కువ సమయంలోనే ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న యువ కథానాయిక భాగ్యశ్రీ బోర్సే తనపై సోషల్ మీడియాలో వస్తున్న 'ఐరన్ లెగ్' వ్యాఖ్యలపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఒక సినిమా విజయం లేదా పరాజయానికి కేవలం కథానాయికను మాత్రమే బాధ్యురాలిగా చేయడం సరైన విధానం కాదని ఆమె స్పష్టం చేశారు. తాను నటిగా తన పాత్రకు పూర్తిస్థాయిలో న్యాయం చేయడమే తన బాధ్యత అని పేర్కొన్నారు. ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన భాగ్యశ్రీ, ఒక కథను అంగీకరించిన తర్వాత కూడా సినిమా నిర్మాణంలో అనేక మార్పులు చోటుచేసుకుంటాయని చెప్పారు. చిత్రీకరణ సమయంలో కథ, కథనం, సన్నివేశాలు, ఇతర అంశాల్లో మార్పులు జరగడం సహజమేనని, అలాంటి విషయాలు నటీనటుల నియంత్రణలో ఉండవని వివరించారు. అందువల్ల సినిమా ఫలితాన్ని ఒక్క కథానాయికపై మోపడం సమంజసం కాదని అన్నారు. సినిమా విజయానికి లేదా అపజయానికి అనేక అంశాలు కారణమవుతాయని, కథ, దర్శకత్వం, కథనం, సాంకేతిక నైపుణ్యం, ప్రేక్షకుల అభిరుచి వంటి అంశాలన్నీ ప్రభావం చూపుతాయని భాగ్యశ్రీ తెలిపారు. ఈ పరిస్థితుల్లో సినిమా ఆశించిన ఫలితం సాధించకపోతే హీరోయిన్లకు 'అరిష్టం' లేదా 'ఐరన్ లెగ్' అనే ముద్ర వేయడం బాధాకరమని పేర్కొన్నారు. అయితే నటిగా తన పాత్రను సరిగా పోషించకపోతే ప్రేక్షకులు విమర్శించే హక్కు ఉందని ఆమె అన్నారు. తన నటనలో లోపాలు ఉంటే ఎలాంటి విమర్శలనైనా స్వీకరిస్తానని, వాటి నుంచి నేర్చుకుని మరింత మెరుగైన నటిగా ఎదగడానికి ప్రయత్నిస్తానని చెప్పారు. కానీ సినిమా ఫలితాన్ని పూర్తిగా తనపై నెట్టేయడం మాత్రం న్యాయం కాదని అభిప్రాయపడ్డారు. ఇటీవల జరిగిన తన తాజా చిత్రం 'లెనిన్' విజయోత్సవ కార్యక్రమంలో కూడా భాగ్యశ్రీ ఇదే అంశాన్ని ప్రస్తావిస్తూ భావోద్వేగానికి గురయ్యారు. వేదికపైనే కన్నీటి పర్యంతమైన ఆమె మాటలు అక్కడున్న వారిని కదిలించాయి. ప్రస్తుతం ఆమె వ్యాఖ్యలకు సామాజిక మాధ్యమాల్లో సినీ అభిమానులు, నెటిజన్ల నుంచి విశేష మద్దతు లభిస్తోంది. సినిమా విజయం, అపజయాలకు ఒక్క నటినే బాధ్యురాలిని చేయడం సరికాదని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.





# ఆరోగ్య సమస్యల వల్లే బరువు పెరిగాను

ప్రముఖ యాంకర్, నటి రష్మీ గౌతమ్ తన శరీరాకృతిపై ఇటీవల వస్తున్న వ్యాఖ్యలపై స్పందించారు. తాను బరువు పెరగడానికి ప్రధాన కారణం ఆరోగ్య సమస్యలేనని స్పష్టం చేశారు. ప్రస్తుతం తన ఆరోగ్యంపై పూర్తిగా దృష్టి సారించానని, కోలుకున్న తర్వాత మళ్లీ మునుపటిలా ఫిట్‌గా కనిపించేందుకు ప్రయత్నిస్తానని వెల్లడించారు. తెలుగు బుల్లితెరపై ప్రముఖ యాంకర్‌గా గుర్తింపు పొందిన రష్మీ గౌతమ్ ప్రస్తుతం పలు వినోదాత్మక కార్యక్రమాలతో పాటు ఓ ప్రముఖ ఓటీటీ వేదికలో ప్రసారమవుతున్న ప్రతిభా వేట కార్యక్రమంలో న్యాయనిర్ణేతగా వ్యవహరిస్తున్నారు. ఈ కార్యక్రమం ప్రచారంలో భాగంగా మీడియాతో మాట్లాడిన ఆమె వ్యక్తిగత, వృత్తిపరమైన జీవితానికి సంబంధించిన పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా ఒక వ్యాఖ్యాత, ఇటీవల కాలంలో మీరు కాస్త బొద్దుగా కనిపిస్తున్నారనే అభిప్రాయాలపై స్పందించాలని కోరగా, రష్మీ తన మనసులోని మాటను వెల్లడించారు. తాను ఇలా కనిపించడం తనకూ ఇష్టం లేదని, అయితే కెమెరాలో కనిపించే రూపం నిజ జీవితంలో ఉండే రూపానికి కొంత భిన్నంగా ఉంటుందని చెప్పారు. కొన్ని సందర్భాల్లో కెమెరా ప్రభావం వల్ల కూడా వ్యక్తులు వాస్తవం కంటే లావుగా కనిపించే అవకాశం ఉంటుందని వివరించారు. అయితే తన విషయంలో బరువు పెరగడానికి ప్రధాన కారణం ఆరోగ్య సమస్యలేనని రష్మీ వెల్లడించారు. ఆ సమస్యల ప్రభావంతో శరీరంలో మార్పులు వచ్చాయని, అందువల్లే ప్రస్తుతం కాస్త బొద్దుగా కనిపిస్తున్నానని తెలిపారు. ఈ పరిస్థితి శాశ్వతం కాదని, ఆరోగ్య సమస్యల నుంచి పూర్తిగా కోలుకున్న తర్వాత మళ్లీ సన్నగా, ఆరోగ్యంగా కనిపించేందుకు కృషి చేస్తానని చెప్పారు. ఇంకా మాట్లాడుతూ, గత రెండు దశాబ్దాలుగా సినీ, టెలివిజన్ రంగంలో ఎన్నో అనుభవాలు ఎదుర్కొన్నానని రష్మీ అన్నారు. విజయాలు, అపజయాలు రెండింటినీ సమానంగా స్వీకరించానని, ప్రతి అనుభవం తనకు కొత్త పాఠాన్ని నేర్పిందని చెప్పారు. అందుకే జీవితంలో ఎలాంటి క్లిష్ట పరిస్థితులు ఎదురైనా ధైర్యంగా ఎదుర్కొనే మనస్తత్వం అలవాటైందని పేర్కొన్నారు. రష్మీ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా చర్చనీయాంశమయ్యాయి. ఆమె ఆరోగ్య సమస్యల గురించి తెలుసుకున్న అభిమానులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ మద్దతు తెలియజేస్తున్నారు.

# చిన్న వయసులోనే..

సినీ పరిశ్రమలో నటీనటుల వ్యక్తిగత జీవితం ఎప్పుడూ అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తిస్తుంటుంది. ముఖ్యంగా ప్రేమ వివాహాలు, వయసు తేడా ఉన్న జంటలు, పెళ్లిళ్లు, విడాకులు వంటి అంశాలు తరచూ చర్చనీయాంశాలవుతుంటాయి. ఈ నేపథ్యంలో ప్రముఖ నటి నజ్రియా నజీమ్ వివాహం మరోసారి సామాజిక మాధ్యమాల్లో చర్చకు వచ్చింది. తమిళ, మలయాళ చిత్రాలతో గుర్తింపు తెచ్చుకున్న నజ్రియా నజీమ్ తెలుగు ప్రేక్షకులకు కూడా సుపరిచితమే. పలు డబ్బింగ్ చిత్రాలతో పాటు నేచురల్ స్టార్ నాని కథానాయకుడిగా నటించిన 'అంటే... సుందరానికి' చిత్రంలో నటించి తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. తన సహజమైన నటన, అందంతో యువతలో మంచి అభిమానాన్ని సంపాదించుకున్నారు. నజ్రియా సినీ జీవితంలో మంచి అవకాశాలు వస్తున్న సమయంలోనే ప్రముఖ మలయాళ నటుడు ఫహద్ ఫాజిల్‌తో ప్రేమలో పడ్డారు. ఇద్దరూ కలిసి నటించిన 'బెంగళూరు డేస్' సినిమా సమయంలో వీరి పరిచయం ప్రేమగా మారింది. అనంతరం కుటుంబ సభ్యుల అంగీకారంతో ఇద్దరూ వివాహం చేసుకున్నారు. నజ్రియా వివాహం చేసుకున్న సమయంలో ఆమె వయసు చాలా తక్కువగా ఉండటంతో ఆ విషయం అప్పట్లో విస్తృతంగా చర్చనీయాంశమైంది. మరోవైపు ఫహద్ ఫాజిల్ ఆమె కంటే వయసులో పెద్దవారు కావడంతో వీరిద్దరి మధ్య ఉన్న వయసు తేడాపై కూడా అనేక కథనాలు వెలువడ్డాయి. అయితే ఈ జంట మాత్రం అలాంటి చర్చలను పట్టించుకోకుండా తమ దాంపత్య జీవితాన్ని కొనసాగిస్తున్నారు. వివాహం తర్వాత కూడా నజ్రియా నటిగా తన ప్రస్థానాన్ని కొనసాగిస్తుండగా, ఫహద్ ఫాజిల్ దక్షిణాది సినీ పరిశ్రమలో అగ్రశ్రేణి నటుడిగా వరుస విజయాలను అందుకుంటున్నారు. ఇద్దరూ తమ తమ చిత్రాలతో బిజీగా ఉంటూ వ్యక్తిగత, వృత్తిపరమైన జీవితాలను సమతుల్యంగా కొనసాగిస్తున్నారు. మధ్యలో వీరిద్దరూ విడిపోతున్నారంటూ సామాజిక మాధ్యమాల్లో పలు ప్రచారాలు జరిగినప్పటికీ, వాటిపై ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. అనంతరం ఈ జంట కలిసి పలు సందర్భాల్లో కనిపించడంతో ఆ ప్రచారాలకు తెరపడింది. ప్రస్తుతం నజ్రియా, ఫహద్ ఫాజిల్ దంపతులు తమ సినీ జీవితంలో విజయవంతంగా ముందుకు సాగుతున్నారు.



Printed, Published and Owned by **RAVU RAJITHA,** Printed at **KAKATHIYA PRINTERS,** LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY. RAJAMUDRA PUBLICATIONS,** Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684,** Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com